# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి


సంపుటి: 13

సంచిక: 10

అక్టోబరు 2024

వెల: 5/- రూ.







ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన దసరా సంబరాలు

అక్టోబరు 3న న్యూఢిల్లీలో జర్నలిజాన్ని కాపాడాలని కోరుతూ ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా ఎదుట జరిగిన సమావేశం



తిరువూరు జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే శ్రీనివాసరావుపై తగిన చర్య తీసుకోవాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసిన ఫెడరేషన్ ప్రతినిధివర్గం




సచివాలయంలో సెప్టెంబరు 12న జరిగిన సమాచార శాఖ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా




విశాఖపట్నంలో అక్టోబరు 6వ తేదీ దసరా సంబరాల సందర్భంగా జరిగిన సమావేశ దృశ్యం



విశాఖపట్నంలో అక్టోబరు 6వ తేదీ దసరా సంబరాల దృశ్యం

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 13 అక్టోబరు 2024 సంచిక: 10**


## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| హక్కులపై ఉక్కు పాదం .............. | 4 |
| సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ............ | 5 |
| తిరువూరు జర్నలిస్టుల ఐక్యత ............................... | 6 |
| జర్నలిస్టుల దసరా సంబరాలు ........................ | 9 |
| విశాఖ జర్నలిస్టులకు సత్కారం ............ | 10 |
| జర్నలిస్టు యూసఫ్ అరెస్టు.......................... | 11 |
| కలం మరణిస్తే వార్త కాదు ....................... | 13 |
| ఈటీవీ బ్యూరో చీఫ్ హఠాన్మరణం ................................ | 14 |
| సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దు ---------------- | 15 |
| అక్రమ కేసుల నమోదు తగదు ..................... | 16 |
| కష్టాల కడలిలో జర్నలిస్టు ....... | 19 |
| సమస్యలూ సవాళ్ళ లేబర్ డే ...... | 28 |



**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

జి.ఆంజనేయులు
వి.నవీన్‌రాజ్
బి.ఎన్.ప్రసాదరావు
వి.రామారావు
బి. ఈశ్వరరావు
టి.మద్దులేటి
ఒ.శాంతి
కె.ఎస్.శంకరరావు
డి.మధుసూదనరావు
ఎస్.వెంకట్రావు
ఎమ్. శ్రీనివాస్
వి.గోపి
ఆర్.రామాంజనేయులు
కె.వేణుగోపాలరావు
వి.భక్తవత్సలం
ఎస్.మురళీశంకర్
జి. శీనుబాబు

డిజైనర్:



**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P.

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9912199494
RNI No. APMUL/2009/37690


# సంఘటిత సమరమే మార్గం!

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సీనియర్ జర్నలిస్టు, ది హిందూ దినపత్రికలో పనిచేస్తున్న మహేష్ లంగను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై ఎలాంటి పిర్యాదు లేదు. అయినా అరెస్టు తప్పలేదు. తెలంగాణలోని సిరిసిల్ల జిల్లాలో 100 టివికి పనిచేస్తున్న మహమ్మద్ యూసఫ్ అనే జర్నలిస్టును అరెస్టు చేశారు. ఆయనకు సంబంధించి కూడా పిర్యాదుదారు యూసఫ్ పేరు ఎక్కడా ప్రస్తావించలేదు. దేశంలోని పలు రాష్ట్రాల్లో వివిధ ప్రదేశాల్లో మీడియాలో పనిచేస్తున్న వారిపై ఇటువంటి పిర్యాదులు, అరెస్టులు కొల్లలుగా పెరుగుతున్నాయి. మరోపక్క హైదరాబాద్ నగర శివార్లలో ఒక విలేకరి కొందరిని బెదిరించి రెండు ఇళ్లస్థలాలు రాయించుకున్నాడని, ఒక ఫ్లాటుకు నామమాత్రంగా పైకం చెల్లించి సొంత చేసుకున్నాడని ఆగ్రహించిన ప్రజలు కట్టేసి కొట్టిన సంఘటన గురించి విన్నాం, విడియోల్లో చూశాం. తెలుగునాట పలుచోట్ల లారీలను ఆపి డబ్బు దండుకుంటున్నారని కేసులు బనాయిస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. మీడియాలో పనిచేస్తున్నవారు లంచగొండులైపోయారని అనుకుంటున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మరోపక్క నిజాయితీగా పనిచేసేవారిపై దాడులు, అక్రమ కేసులు, రాజ్యహింస తదితర చర్యల కారణంగా తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమాజంలోని అవలక్షణాల ప్రభావం మిగిలిన వర్గాలతో పాటు మీడియాను పట్టి పీడిస్తున్నదని సరిపెట్టుకోవడం మనల్ని మభ్యపెట్టుకోవడమే అవుతుంది. సమాజహితం కోరి మీడియాను వృత్తిగా ఎంచుకుని ఈ రంగంలోకి అడుగుపెట్టాం. సమాజహితంలో జనావళిని చైతన్యవంతులను చేసే బృహత్తర కర్తవ్యం కూడా మనపై ఉన్నదని విస్మరించాల్సిన అవసరం లేదు. చెడుపై సమరం చేసేందుకు జనులను సమాయత్తం చేసే బాధ్యత కారణంగానే స్వాతంత్రోద్యమ కాలంలో పనిచేసిన అనేకమంది నాయకులు నాడు పత్రికలను ఎంచుకున్నారు. పత్రికల ద్వారా చైతన్యపరిచి సంఘటితం చేయడం వల్లనే స్వాతంత్ర్య సముపార్జన సాధ్యమైంది. ఇన్నేళ్ళ స్వాతంత్ర్యానంతరం మీడియాలో పనిచేస్తున్నవారు నడివీధిలో దిక్కుతోచని స్థితిలో నిలబడి ఉన్నారు. ప్రజాచైతన్యంతో పాటు స్వజనాన్ని చైతన్యవంతుల్ని చేయాలి. వృత్తి విలువలు కాపాడుకుంటూ ముందుకు సాగేందుకు అన్నిరకాల ఆటుపోట్లను తట్టుకుని నిలబడాలి. తక్కువ వేతనాలతో, నామమాత్రపు వేతనాలతో పనిచేసిన వాళ్లం నేడు యాజమాన్యాలకు ఎదురుజీతాలు ఇచ్చే దుస్థితికి చేరుకున్నాం. వాటి ఫలితంగా మనకు లభిస్తున్న అప్రతిష్ట రోజురోజుకు పెరుగుతున్నది. మీడియాలో అంతరాలు జర్నలిస్టుల వల్ల కాదు, మీడియా యాజమాన్యాల ధోరణి కారణంగా అని ఘంటాపథంగా చెప్పగలిగే పరిస్థితి నెలకొనాలి. అందుకు జర్నలిస్టులతో పాటు ఈ రంగంలో పనిచేస్తున్న నాన్ జర్నలిస్టులు కలిసి సంఘటితంగా నడవడం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది.




# హక్కులపై ఉక్కుపాదం - మీడియాపై సర్కార్ నిఘా

మీడియా హక్కులను మోడీ సర్కార్ కాలరాస్తోందని సీనియర్ జర్నలిస్టులు విమర్శించారు. మీడియాను మోడీ ప్రభుత్వం వేటాడుతోందని, నిఘా పెంచిందని వివరించారు. మీడియా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే మోడీ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు, న్యూస్ క్లిక్ చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థను అరెస్టు చేసి ఏడాది పూర్తైన సందర్భంగా అక్టోబరు 3వ తేదీ న్యూఢిల్లీలోని స్థానిక ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)లో స్వతంత్ర జర్నలిజంపై దాడిని ఖండిస్తూ డీయూజే, పీసీఐ, ఐడబ్ల్యూపీసీ, ప్రెస్ అసోసియేషన్, కేయూడబ్ల్యూజే సంయుక్త ఆధ్వర్యంలో నిరసన సభ నిర్వహించారు. 'న్యూస్‌క్లిక్' పోర్టల్‌పై పుర్కాయస్థ అరెస్ట్, ప్రొసీడింగ్స్‌ను పాటించకుండా మీడియాపై మోడీ ప్రభుత్వం ప్రధాన దృష్టిని కేంద్రీకరిం చిందని 'ది వైర్' వ్యవస్థాపక ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్ అన్నారు. 2017లో ఎన్డీటీవీ ప్రమోటర్లపై సీబీఐ కేసుతో, మోడీ ప్రభుత్వం స్పష్టంగా మీడియా వేట ప్రారంభించిందని తెలిపారు. కేంద్ర విధానాలపై విమర్శించే సాహసం చేసిన ఏకైక జాతీయ ఛానల్ ఎన్డీటీవీ మాత్రమే అని అన్నారు. ఎన్డీటీవీని అదానీ తన సొంతం చేసుకున్న తరువాత సీబీఐ కేసును మూసివేసిందని ఆయన తెలిపారు.

### పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల అణచివేత

దారుణ సెక్షన్లతో కూడిన బ్రాడ్‌కాస్ట్ బిల్లును కేంద్రం ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నప్పటికీ, దానిని తిరిగి తీసుకురావడానికి ఇంకా అవకాశం ఉందని అన్నారు.

'న్యూస్‌క్లిక్'లో ఢిల్లీ పోలీసులు జరిపిన దాడిలో స్వాధీనం చేసుకున్న వందలాది ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ తిరిగి రాలేదని న్యూస్ క్లిక్ వ్యవస్థాపక చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ అన్నారు. న్యూస్‌క్లిక్‌కు సహకరించిన వారి పరిశోధనా పత్రాలు పోలీసుల వద్ద ఉన్నాయని, ఆదాయపన్ను శాఖ చర్యకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. సామాన్య ప్రజల నుంచి వస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్ట్ నీలు వ్యాస్ థామస్ మాట్లాడుతూ ప్రభుత్వం, ఏజెన్సీల వేధింపులు జర్నలిస్టుల కుటుంబ సభ్యులపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పాత్రికేయులు ఎన్. రామ్, పి. సాయినాథ్ వీడియో సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టికె రాజలక్ష్మి, ఎస్ కె పాండే, జైశంకర్, ధనసుమోద్ తదితరులు మాట్లాడారు. సుజాత మధోక్ అధ్యక్షత వహించారు.

# పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

జాతీయస్థాయిలో త్వరలో ఢిల్లీలో జరగనున్న జర్నలిస్ట్ ల ప్రత్యేక సమావేశానికి నగరానికి చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొనడం జరుగుతుందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్ లు తెలిపారు. అక్టోబరు 11న ఇక్కడ అక్కయ్యపాలెం వద్ద ఒక ప్రైవేటు హొటల్లో శుక్రవారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ కార్యవర్గాలు ప్రత్యేకంగా సమావేశం అయ్యాయి.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్లో ఢిల్లీ వేదికగా ఢిల్లీ జర్నలిస్ట్ యూనియన్( డియుజె )ఆధ్వర్యంలో ఆయా రాష్ట్రాల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వాటి పరిష్కారాలను కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రత్యేకంగా ఆ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. డీజేయూ అధ్యక్షులు ఎస్. కె.పాండే అధ్యక్షతన జరిగే ఈ సమావేశ లో పలు రాష్ట్రాల జర్నలిస్ట్ ల సంఘాల ప్రతినిధిలు పాల్గొంటారన్నారు. అలాగే రాష్ట్రంలో

## మూడు సంఘాల ఉమ్మడి కార్యవర్గాల నిర్ణయం

పెండింగ్లో ఉన్న జర్నలిస్టుల సమస్యలపై ఈ నెల 16న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో విజయవాడలో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు చెప్పారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్య వర్గం, జిల్లాల సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని మంత్రి దృష్టికి పెండింగ్ సమస్యలను తీసుకువెళ్తామన్నారు.

ప్రధానంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య, అక్రిడేషన్లు సరళీకరణ, పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ విధానం అమలు, ప్రమాద బీమా పాలసీ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, అన్ని కమిటీ ల్లో జర్నలిస్ట్ సంఘాలు కు ప్రాతినిధ్యం వంటి పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరుతామన్నారు. విశాఖపట్నం జిల్లాలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్రాడ్కాస్ట్ జర్నలిస్టులు, చిన్న, మధ్యతరహా పత్రికల అసోసియేషన్ బాధ్యులు కలిసి ఉమ్మడిగా పనిచేయాలని నిర్ణయించారు. దసరా పర్వదినం సందర్భంగా కార్యవర్గాల సభ్యులకు గంట్ల శ్రీనుబాబు, నారాయణ్ చేతులు మీదుగా మిఠాయిలు పంపిణీ చేసారు.

ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వర రావు,మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్, కార్యదర్శి కె. శ్రీనివాస రావు, ఫెడరేషన్ డిప్యూటీ సెక్రటరీ ఎ. సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి. రవికుమార్, పి. ఎస్. ప్రసాద్,కోశాధికారి బి. సీతారామమూర్తి, ఉపాధ్యక్షులు ఎన్. రామకృష్ణ,కామాకుల మురళీకృష్ణ, కృష్ణమూర్తి నాయుడు, నాగేశ్వరరావు జాయింట్ సెక్రటరీలు జి. రాంబాబు, నగేష్,కార్యవర్గ సభ్యులు రవిశంకర్, చింతా ప్రభాకర్, కిషోర్, రాజశేఖర్, వెంకట్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎంఎల్ఎ కొలికపూడి వ్యాఖ్యలపై నిరసనలో

# తిరువూరు జర్నలిస్టుల ఐక్యత



ఎం.బి.నాథన్
ఎపిడబ్ల్యుజెఎఫ్ కార్యదర్శి, ఎన్‌టిఆర్ జిల్లా

## క్షమాపణలు చెప్పిన ఎంఎల్ఎ

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ జర్నలిస్టుల ఐక్యత, పట్టువిడువకుండా సాగించిన ఉద్యమం భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. జర్నలిస్టులపై ఆత్మగౌరవాన్ని కించపరిచేలా, వారి ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేలా తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై నిరసన గళం వినిపించి విశ్రమించకుండా పోరాడిన తీరు అభినందించదగినది. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ జర్నలిస్టులు చేపట్టిన ఉద్యమాన్ని నియోజకవర్గ స్థాయి నుండి జిల్లాస్థాయికి, అక్కడి నుండి రాష్ట్రస్థాయికి తీసుకెళ్లగలిగి ఫలితాన్ని సాధించడంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) కీలకపాత్ర పోషించింది.

**జర్నలిస్టులపై తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి అనుచిత వ్యాఖ్యలు**

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లో అధికారుల అనుమతి లేకుండా అక్రమార్కులు గ్రావెల్, ఇసుక తరలిస్తున్నారని వివిధ ప్రతికల్లో కథనాలు వచ్చాయి. దీనిని జీర్ణించుకోలేని తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సెప్టెంబరు 24వ తేదీ తిరువూరు రాజస్థాన్ టీ సెంటర్లోని తన కార్యాలయం వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో విలేకరులపై విరుచుకుపడ్డారు. తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేశారు. అసభ్య పదజాలంతో దూషించారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిని క్షమించబోనని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఆంధ్రజ్యోతి ఎ.కొండూరు విలేకరి చెన్నారావును ఆయన ఇంటికెళ్లి కొడతానని బెదిరించారు. ఇంకెవరైనా అలా వార్తలు రాస్తే అలానే చేస్తానంటూ జర్నలిస్టులందరికీ హెచ్చరికలు జారీ చేశారు.

**ఎంఎల్ఎ వ్యాఖ్యలకు నిరసనగా ఆర్‌డిఒకు జర్నలిస్టుల వినతి**

పాత్రికేయులపై ఎంఎల్‌శ్రీ కొలికపూడి శ్రీనివాసరావు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అదే రోజు తిరువూరు ఆర్‌డిఒకు నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులంతా వినతిపత్రం సమర్పించారు. అంతేగాక మరుసటి రోజు సెప్టెంబరు 25న తిరువూరు తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని చెప్పి మరీ వచ్చారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కూడా తమకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**ఎంఎల్ఎ కొలికపూడి వ్యాఖ్యలను ఖండించిన ఎపిడబ్ల్యుజెఎఫ్**

పాత్రికేయులపై తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్)



ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథాన్ తీవ్రంగా ఖండించారు. ఎంఎల్ఏ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరువూరు నియోజకవర్గ జర్నలిస్టులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపారు. జర్నలిస్టులపై ఎంఎల్ఏ వ్యాఖ్యలను, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు కూడా ఖండించారు.

**తిరువూరు తహశీల్దారు కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా**

పాత్రికేయులపై చేసిన వ్యాఖ్యలను ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు ఉప సంహరించుకుని తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని నియోజకవర్గంలోని అన్ని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల నేతలు సంయుక్తంగా సెప్టెంబరు 25వ తేదీ తిరువూరు తహశీల్దారు కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. పట్టణంలో బోసుబొమ్మ సెంటర్ నుండి మెయిన్ రోడ్డు, నగర పంచాయతీ కార్యాలయం మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఎంఎల్ఏ క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. ఎంఎల్ఏ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తానొక ప్రజాప్రతినిధినన్న విషయాన్ని కూడా మర్చిపోయి సభ్యత, సంస్కారంలేకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. పత్రికల్లో వచ్చిన కథనాల్లో వాస్తవం లేకపోతే వివరణ ఇవ్వొచ్చని, పరువు నష్టం దావా వేసుకోవచ్చని, కానీ ఇవేమీ లేకుండా జర్నలిస్టులను బెదిరించడం గర్హనీయమన్నారు. వ్యక్తిగత దూషణలకు దిగటం, పాత్రికేయులందారినీ ఇళ్లకు వచ్చి గుడ్డలూడదీసి కొడతానని బెదిరించడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని ఆగ్రహం వ్యక్తం



ఆంధ్రజ్యోతి విలేకరి చెన్నారావు

చేశారు. పాత్రికేయులను బెదిరించి, భయపెట్టాలనుకోవడం భ్రమే అవుతుందని జర్నలిస్టులు స్పష్టం చేశారు. ఎంఎల్ఏ వ్యాఖ్యలపై టిడిపి రాష్ట్ర నాయకత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితిలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎం.వి.నారాయణ, ఎం.గోపీ, బద్రి, సైదులు, విజయ్, చెన్నారావు, కృష్ణారెడ్డి, పి.మహేష్, బి.వెంకటేశ్వరరావు, మురళీ, అంజియ్య, రాంమోహన్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

**నియోజకవర్గ జర్నలిస్టులతో ఏపిడబ్ల్యుజెఎఫ్ సమావేశం, కార్యాచరణ రూపకల్పన**

ఎంఎల్ఏ కొలికపూడి వ్యాఖ్యలను ఖండిస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) నడుం బిగించింది. సెప్టెంబరు 26వ తేదీ నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో తిరువూరులో సమావేశం నిర్వహించింది. రాష్ట్ర కేంద్రం నుండి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి .ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, ఎన్‌టిఆర్ జిల్లా నుండి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్ తదితరులు తిరువూరు వెళ్లారు. ఫెడరేషన్ జిల్లా నాయకులు ఎం.వి.నారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించారు. సెప్టెంబరు 28న మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేసేందుకు తిరువూరు నుండి జర్నలిస్టులంతా కలిసి వెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఏపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి .ఆంజనేయులు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అక్రమాలను, అన్యాయాలను వెలికితీసి ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్యా వారధిగా నిలుస్తున్న విలేకర్లను బెదిరించి, బట్టలూడదీసి కొడతానని ఎంఎల్ఏ కొలికపూడి చేసిన అనుచిత వ్యాఖ్యలు పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధి అయి ఉండీ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాత్రికేయులు రాసిన కథనంలో ఏవైనా అవాస్తవాలు ఉంటే పత్రికా ప్రకటన ద్వారాగానీ, మీడియా సమావేశం ద్వారాగానీ వివరణ ఇవ్వొచ్చని లేదా ఖండించొచ్చని అన్నారు. కానీ అసభ్య పదాజాలంతో జర్నలిస్టులను దూషించడం బాధాకరమన్నారు. జర్నలిస్టులకు ఎంఎల్ఏ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలు సమస్యలపై జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ పలువురు జర్నలిస్టులు ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఆంజనేయులు పేర్కొన్నారు. జర్నలిస్టులంతా ఐక్యంగా తమ సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.




**ఎంఎల్ఎపై చర్యలు తీసుకోండి**

**ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన సిఎం చంద్రబాబుకు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రాల సమర్పణ**

జర్నలిస్టులను దుర్భాషలాడి, వారిని తన అనుచరులతో కొట్టిస్తానని బెదిరింపులకు పాల్పడిన తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యాన తిరువూరు నియోజకవర్గం నుండి మంగళగిరిలోని టిడిపి కార్యాలయం వద్దకు తరలివచ్చిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులంతా సెప్టెంబరు 28వ తేదీ జరిగిన గ్రీవెన్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రాబాబునాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి.నారాయణ, జర్నలిస్టులు యు.వెంకట్రావ్, బద్రి, బి.వెంకటేశ్వరరావు, బడ్డు విజరు బాబు, మరకాల గోపితోపాటు 25 మంది వరకు జర్నలిస్టులు పాల్గొన్నారు. దీనిపై సిఎం చంద్రాబాబు స్పందిస్తూ జరిగిన సంఘటన తన దృష్టిలో ఉందన్నారు. త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే వారు ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. తమ పార్టీ జర్నలిస్టులకు అండగా ఉంటుందని, జర్నలిస్టులెవరూ అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదావ్‌నూ కలిసి విజ్ఞాపన పత్రం అందించారు. దీనిపై పల్లా శ్రీనివాసరావు స్పందిస్తూ కొలికపూడితోపాటు రాష్ట్రంలో ఇంకా ముగ్గురు ఎమ్మెల్యేలపై కూడా పిర్యాదులు వచ్చాయని, సిఎం చంద్రాబాబు త్వరలోనే చర్యలు తీసుకుంటారని చెప్పారు. తమ అధినేత చంద్రాబాబు దృష్టిలో కూడా ఈ విషయం ఉందని చెప్పారు. తప్పుచేస్తే ఎవరిపైనైనా చర్యలుంటాయని పల్లా స్పష్టం చేశారు.

ఎంఎల్ఎ కొలికపూడి క్షమాపణ

జర్నలిస్టులపై తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు సెప్టెంబరు 30వ తేదీన తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు ప్రకటించారు. జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పారు. దీంతో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన తిరువూరు నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులంతా ఐక్యంగా, పట్టువిడువకుండా సాగించిన పోరాటం ఫలించినట్లయింది.



**ప్రకాశం జిల్లాలోని విలేకరుల పిల్లలకు ఫీజులో ప్రవేట్ పాఠశాలలో 50 శాతం రాయితీ వర్తింప చేసేలా కృషి చేయాలని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు**

# జర్నలిస్టుల దసరా సంబరాలు



విజయ దశమి పండుగ మనందరి జీవితాల్లో ఆనందం తీసుకు రావాలని విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు ఆకాంక్షించారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల సంయుక్తంగా నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జర్నలిస్టుల దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడిలో ఉంటూ విశ్రాంతి లేని బిజీ జీవితం గడుపుతున్నారని వారికి, వారి కుటుంబాలకు పర్వ దినాల సందర్భంగా ఆహ్లాదం, ఆనందం కలిగించేందుకు ఇటువంటి సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య సమస్యల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విమ్స్‌లో జర్నలిస్టులకు పూర్తి స్థాయిలో ఉచిత సేవలు నిరంతరం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్‌ల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిజి. ఆంజనేయులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబులు మాట్లాడుతూ విజయదశమి పర్వదినంతో ప్రతీ ఒక్కరు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల జీవితలక్ష్యం అయిన ఇండ్ల స్థలాల సాధన కోసం ప్రభుత్వ పెద్దలను పలుమార్లు కలసి విన్నవించామన్నారు. అది త్వరలోనే కూటమి ప్రభుత్వం ద్వారా సిద్ధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టుల అక్రిడిటేషన్ సమస్యలు పరిష్కారం కోసం గట్టిగా ప్రయత్నిస్తామన్నారు. త్వరలో మంత్రులు ద్వారా జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ జాతీయ జర్నలిస్టుల సంఘం జర్నలిస్టుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఈ దశరా సందర్భంగా జర్నలిస్టుల కుటుంబ సభ్యులంతా ఒక చోట చేరి సంబరాలు ఘనంగా నిర్వహించు కోవడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టుల అల్పాహారాలతో ప్రారంభమైన ఈ దసరా సంబరాల కార్యక్రమంలో ప్రదర్శించిన పలు సంగీత సాహిత్య నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో మధ్యలో పలు సార్లు లక్కీ డిప్ ద్వారా ఎంపికైన వారికి పలు బహుమతులను అందించారు. ఆల్ఫాహారంతో ప్రారంభమైన ఉత్సవాలు అధ్యంతం సందడి నింపాయి..మధ్యాహ్నము విందు అనంతరం స్వీట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఫెడరేషన్ అర్బన్ యూనిట్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరావు,ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈరోతి ఈశ్వరరావు, కార్యదర్శి మదన్, జర్నలిస్టుల ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, పితాని ప్రసాద్,ఉపాధ్యక్షులు బండారు శివప్రసాద్, కామాకుల మురళీకృష్ణ, ఎన్. రామకృష్ణ, కోశాధికారి బి. సీతారామమూర్తి, జాయింట్ సెక్రటరీ గొడబ రాంబాబు,రవిశంకర్,ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులువై. రామకృష్ణ..ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్, కార్యదర్శి శ్రీనివాసరావు కె. వి. శర్మ వివిధ కార్యవర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ఎంఏఎన్ పాత్రుడును ఘనంగా సన్మానించారు.






### ఉపకార చార్టిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# విశాఖ జర్నలిస్టులకు సత్కారం

దేశాన్ని, సమాజాన్ని సక్రమంగా తీర్చిదిద్దటంలో ఫోర్త్ ఎస్టేట్ పాత్ర అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార చార్టిబుల్ ట్రస్ట్ అధినేత, సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు అన్నారు. అక్టోబరు 1వతేదీ విశాఖ పౌరగ్రంధాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అనుబంధ సంస్థ ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ , ఉపకార్ చార్టిబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విశేష సేవలు అందిస్తున్న జర్నలిస్టులను , వీడియో జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కంచర్ల అచ్యుత రావు మాట్లాడుతూ ప్రజలకు నిర్భయంగా నిజాలు తెలియ చేసే మీడియా అంటే ఎంతగానో అభిమానిస్తానన్నారు. జర్నలిస్టులకు ఎల్లవేళలా తాను అండగా ఉంటానని తెలిపారు. త్వరలో విడుదలకు సిద్దమవుతున్న కంచర్ల సినిమా విడుదల రోజున జర్నలిస్టుల సంక్షేమానికి పదిలక్షల రూపాయలు అందచేస్తానని జర్నలిస్టుల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఎయిర్పోర్ట్ సలహాసంఘం సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టులకు అన్నివిధాలా అండగా నిలిచే కంచర్ల చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మీడియా విస్తృతంగా ప్రాచుర్యం కల్పించాలని కోరారు. దాదాపు మూడు దశాబ్దాలుగా మీడియాలో సేవలందిస్తున్న తాను జర్నలిస్టులకు పలు విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటుందన్నారు. ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పీ నారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని త్వరలో సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రిని కలిసి ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరనున్నట్లు తెలిపారు. అనంతరం విశాఖ ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో విశేష సేవలు అందిస్తున్న రామకృష్ణరావు (ఏబిన్ స్టాఫ్ రిపోర్టర్), అక్కెన నరేష్ (సాక్షి క్రైమ్ రిపోర్టర్) జార్జ్ (10 టివి బ్యూరో చీఫ్) అప్పల రాజు (ప్రైమ్ టీవీ బ్యూరో చీఫ్ ), గజం విజయ్ (యాక్ట్ న్యూస్ బ్యూరో చీఫ్) ఎమ్మెస్సార్ ప్రసాద్ బ్యూరో చీఫ్), కిలాపర్తి పీటర్ ప్రదీప్ (స్వతంత్ర టీవీ రీజినల్ కో ఆర్డినేటర్ ) భాస్కర్ శంకర రావు ( టీవీ 9 కెమెరా మెన్), నరేష్ (ఎన్టీవీ కెమెరా మెన్), కేవీ అప్పారావు (టీవీ 5 సీనియర్ కెమెరా మెన్), సారిక అప్పల స్వామి(ఐ



# సిరిసిల్లలో జర్నలిస్టు యూసఫ్ అరెస్టు



సిరిసిల్ల జిల్లాలో జర్నలిస్టుగా పనిచేస్తున్న మహమ్మద్ యూసఫ్‌ను చందుర్తి పోలీసులు అక్టోబరు 8వతేదీ అరెస్టు చేశారు. ఆయనపై పోలీసులు మోపిన అభియోగం మోసం చేసి డబ్బు కాజేశాడని. ఫిర్యాదు చేసిన వ్యక్తి యూసఫ్ పేరు ప్రస్తావించలేదు. ఫిర్యాదుదారు తమ గ్రామానికి చెందిన ఒక మహిళా జర్నలిస్టుతో కొనసాగించిన లావాదేవీలకు సంబంధించిన వివాదం చాలాయేళ్ళుగా కొనసాగుతున్నదని ఫిర్యాదు చదివిన ఎవరికైనా అర్థమవుతుంది. 2019 నుంచి ఇద్దరు వ్యక్తులు, వారు సాగించిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివాదాన్ని జర్నలిస్టు వివాదంగా మార్చారు. అక్రిడిటేషన్ కార్డు కోసం, ప్రభుత్వం నుంచి జర్నలిస్టులకు ఇచ్చే డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం ఆయన 26 లక్షల రూపాయలు ఆ మహిళకు ఇచ్చాడని వాటిని యూసఫ్ కాజేసాడని ఆరోపిస్తున్నారు. ఆ మహిళను, ఆమెతో పాటు శ్రీనివాస్ అని మరో వ్యక్తిని గత నెలలో అరెస్టు చేశారు. అప్పటి నుంచి జిల్లా కేంద్రంలోనే ఉన్న యూసఫ్‌ను విచారణకు కూడా పిలవని పోలీసులు విచారించేందుకు పిలిస్తే నిరాకరించాడని, తప్పించుకుని తిరుగుతున్నాడని అభాండాలు మోపుతున్నారు. యూసప్ అరెస్టుకు ముందు నాలుగు రోజుల క్రితం అదే పోలీస్‌స్టేషన్‌కు సమాచార సేకరణ పనిలో వెళ్ళిన సమయంలో కూడా వారు ఏమాత్రం పట్టించుకోలేదు. జరుగుతున్న సంఘటనలను బట్టి ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జర్నలిస్టుల్లో తీవ్ర అందోళన రేకెత్తింది. ఇప్పటికే కరీంనగర్, సిరిసిల్లలోని జర్నలిస్టులు యూసఫ్‌పై బనాయించింది అక్రమ కేసని, వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆయా జిల్లాల కలెక్టర్లకు, ఉన్నతస్థాయి పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. ఆందోళన తీవ్రతరం కాకముందే సమస్య పరిష్కారానికి మార్గం చూడాల్సి ఉంది.

**అక్రమ కేసు వెంటనే ఎత్తివేయాలి**

జర్నలిస్టు ఎండి యూసుఫ్ పై చందుర్తి పోలీస్ స్టేషన్లో పెట్టిన అక్రమ కేసును తొలగించి, అతనిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే తిరుపతి, కే బాపూరావు లు డిమాండ్ చేశారు. అక్టోబరు 14వ తేదీ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. కేసుకు సంబంధించిన వివరాలను కలెక్టర్, సిపి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పోలీసులు ఇటీవల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, సిరిసిల్ల జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు ఎండి యూసుఫ్ కు సంబంధంలేని ఒక కేసును అంటగట్టి అతనిపై అక్రమంగా కేసు నమోదు చేశారని

---

## ఉపకార చార్టిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

న్యూస్), సిరికి నూకనాయుడు (సిటీ కేబుల్ న్యూస్ వీడియో జర్నలిస్ట్) జర్నలిస్టులను, వీడియో జర్నలిస్టులను ముఖ్య అతిథి కంచర్ల అచ్యుత రావు, గంట్ల శ్రీనుబాబు, నారాయణ పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. అనంతరం అతిథులను బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్‌లు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతల కుటుంబ సభ్యులు, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు నాయుడు, నర్సింగరావు, సురేష్, శేషు మళ్ళ దేవత్రినాథ్, దిలీప్, డి రవి కుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

తెలిపారు. ఈ సంఘటనపై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చట్ల శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్, నరేష్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పెరుక రవి జర్నలిస్టులు, ప్రసాద్, అంజయ్య, శంకర్ రెడ్డి, రవీందర్, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**సిరిసిల్లలో**

జర్నలిస్టు ఎండి యూసుఫ్ పై చందుర్తి పోలీసులు పెట్టిన అక్రమ కేసును తొలగించి, జైల్లో వున్న అతనిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఆయన ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పెరుక రవి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు,మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి ఎం.గోపాల్ తదితరులు రాజన్న సిరిసిల్ల సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అఖిల్ మహాజన్, జిల్లా అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ లను అక్టోబరు 15వ తేదీ కలిసి వినతి పత్రాలు సమర్పించారు.



కేసుకు సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా వారు అదనపు కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పోలీసులు ఇటీవల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, సిరిసిల్ల జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు ఎండి యూసుఫ్ కు సంబంధంలేని ఒక కేసును అంటగట్టి అతనిపై అక్రమంగా కేసు నమోదు చేశారని తెలిపారు. యూసుఫ్ పై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరింపజేసి, అతనిని వెంటనే విడుదల చేయాలని కోరారు. తప్పు చేయని జర్నలిస్టులపై ఇలా తప్పుడు కేసులు పెట్టడం తగదని, ఈ సంఘటనపై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించి జర్నలిస్టు యూసుఫ్ పై తప్పుడు కేసు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులపై అక్రమ కేసులు ఉండవని భావించామని, కానీ అక్రమ కేసుల బనాయింపులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టు యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసు పెట్టడం సహించరానిదని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె బాపురావు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పెరుక రవి, మహబూబ్నగర్ కార్యదర్శి గోపాల్, వేములవాడ అధ్యక్షులు కొప్పుల ప్రసాద్, కార్యదర్శి, నరేందర్, నాయకులు సురేందర్, బిక్షపతి, తోట శేఖర్, చింతల శ్రీనివాస్, షరీఫ్,సత్యం, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



# కలం మరణిస్తే వార్త కాదు



**జంధ్యాల భారతికి నివాళి**

**ఓ** గోల్డ్ మెడల్ జర్నలిస్టు అనాథ మరణం

ఆమె యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించారు. ప్రభుత్వాలను శాసించే నంబర్ వన్ సంస్థలో జీవితాన్ని ప్రారంభించి దాదాపు నాలుగు దశాబ్దాలు అదే జీవితం .

ఆమెది ఒంటరి జీవితం. హైదరాబాద్ మహానగరంలో ఒంటరిగా గదిలో ప్రాణాలు విడిచింది. తలుపు బద్దలు కొట్టి చూస్తే తప్ప ఆమె మరణం బయటి వారికి తెలియలేదు. అనాథ శవానికి పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ వార్త టీవీ వారి దృష్టిలో పడితే పండగే. మానవత్వం మంటగలిసింది, ఎక్కడికి వెళుతున్నాం, మనుషులమేనా అంటూ వీలైతే సినిమా పాటలతో అద్భుతంగా మానవత్వాన్ని తట్టిలేపే విధంగా చక్కని స్టోరీ ప్రసారం చేసేవారు. పత్రికల్లో ఐతే చేయి తిరిగిన సబ్ ఎడిటర్ చేతిలో పడితే కన్నీళ్లు పెట్టించే కవిత్వంతో వార్త వెలుగు చూసేది.

మరణం నిజమే కానీ టివిలో కానీ, మీడియాలో కానీ హృదయ విదారక కథనాలేమి రాలేదు. ఎందుకంటే అలా మరణించింది ఓ మహిళా జర్నలిస్ట్. ఎవరైనా ఇలా మరణిస్తే జర్నలిస్టులు హృదయ విదారకంగా కథనం రాస్తారు కానీ జర్నలిస్ట్ మరణిస్తే అలా రాయరు. ఎందుకలా అంటే అదంతే!

జంధ్యాల భారతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో జర్నలిజంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈనాడులో జర్నలిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించి తరువాత ఫ్రీ లాన్సర్‌గా ఉన్నారు. మిత్రుడు నామాల విశ్వేశ్వరరావు ఫోన్ చేసి జంధ్యాల భారతి సంస్మరణ సభ నిర్వహించాలని ఉంది. ఆమె ఇలాంటివి తనకు నచ్చవు వద్దు అని గతంలో చెప్పారు అని కొందరు అంటున్నారు. మీ అభిప్రాయం ఏమిటీ అని అడిగారు.

మీరు సంస్మరణ సభ నిర్వహించినా, నిర్వహించక పోయినా పోయిన వారికి తెలియదు. మనం ఎలా బతుకుతున్నాం అని మనకు మనం చెప్పుకోవడానికి .. మన జీవితాన్ని మనం సమీక్షించుకోవడానికి సభ నిర్వహించాలి అనేది నా అభిప్రాయం అని చెప్పాను. ఆమె కోసం కాదు మన కోసం అవసరం అని చెప్పాను.

నిన్నటి రోజంతా ఈ విషయం మీదే చర్చ, ఆలోచన. ఆమెతో పెద్దగా పరిచయం లేదు .. ఆంధ్రభూమిలో ఉండగా చాలా సార్లు చూశాను .. ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్‌గా అన్ని పత్రికలకు రాసేవారు. ముందు ప్రభ, తరువాత కరోనాలో భూమిలో పారితోషికం ఇవ్వడం మానేశాక రాయడం మానేశారు.

మిత్రుడు విశ్వేశ్వర రావు చెప్పిన వివరాల ప్రకారం ఆమె ఈనాడులోనే జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఎంవిఆర్ శాస్త్రి , కెయల్ రెడ్డి వంటి వారితో కలిసి ఈనాడులో పని చేశారు. అక్కడి ఉద్యోగిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అక్కడ ఇలాంటి ప్రేమ పెళ్లిళ్లు కొత్తేమి కాదు. ఐతే ఇద్దరిలో ఒకరు రాజీనామా చేయాలి, ఇది నిబంధన. ఆమె రాజీనామా చేసింది. కాపురం మూన్నాళ్ళ ముచ్చట కాదు, ఒక రోజు ముచ్చటగానే మిగిలి పోయింది. మళ్ళీ ఒంటరి జీవితమే. ప్రైవేటు ఉద్యోగం అంటేనే బతుకు భయం భయం, ఇక జర్నలిస్ట్ ఉద్యోగం అంటే మరింత భయం. ఆమె అలానే జీవితమంతా భయంతో కలిసి బతికింది, చనిపోయింది.

అందరి జీవితాలు ఇలానే ఉంటాయి అని కాదు. సినిమా రంగం, జర్నలిజం, రచయిత ఏ రంగం ఐనా కావచ్చు. ఎవరి బతుక్కు వారే కారణం. సమాజం, తోటివారు, యూనియన్లు అని మాట్లాడితే పలాయన వాదమే అవుతుంది. జర్నలిజం నుంచి సివిల్స్‌కు ఎంపిక అయిన వారు ఉన్నారు. మందుకు బానిసలైన వారు ఉన్నారు.

ఆయేషా అని దక్కన్ క్రానికల్‌లో క్రైం రిపోర్టర్ ఉండేవారు. అమ్మాయి అయినా ఎప్పుడూ మార్చురీల చుట్టూ తిరిగేది. ఇప్పటిలా వాట్స్ ఆప్ జర్నలిజం కాదు కాబట్టి రోజూ మార్చురీకి వెళ్ళేది. ఐనా ఆఫీస్‌లో వేధింపులు. ఉద్యోగం వదిలేసింది. కొంతకాలం తరువాత ఆమె ఏకంగా జిల్లా కలెక్టర్ అయ్యారు.

చిన్న వయసు వారు కనిపిస్తే బోలెడు ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకు రైల్వే ఉద్యోగాల నోటిఫికేషన్లు వస్తుంటాయి వెళ్లొచ్చు కదా? అనేవాడిని. అలా వెళ్లిన ఎంతో మందిని చూశా. శ్రీ శ్రీ, వేటూరి సుందర రామ మూర్తి వంటి గొప్ప వారు మొదట్లో జర్నలిస్టులే. ఇవి ఆ రోజులు కాదు.

ఇతర రంగాల్లో రాణించిన వారిని చూశా, అనాథల్లా మరణించిన వారిని చూశా.

భూమిలో చిక్కడపల్లి చారీ అని ఒక పార్ట్ టైం విలేఖరి ఉండేవారు. ఓ రోజు “సార్ నేను

ఎడిటర్ ఇంటికి వెళ్తా, ఎడిటర్ చెప్పిన పని చేస్తా, ఆఫీస్‌కు వచ్చాక న్యూస్ ఎడిటర్, బ్యూరో డెస్క్ సహా అందరి మీద అధికారం చెలాయిస్తా. నేను ఒక్కరికి తలవంచి, మీ అందరినీ భయపెడతా అని చెప్పుకుంటూ పోయాడు. భ్రమల్లో బతుకుతున్నాడు పాపం అనిపించింది. అతని గురించి కొన్ని రోజుల తరువాత తెలిసింది. చనిపోయాడు నాలుగు రోజులు మార్చురీలోనే శవం. ఎవరూ రాలేదు.

ఎన్టీఆర్‌ను దించేసే సమయం. అప్పుడు సెల్ ఫోన్లు లేవు. సచివాలయం ప్రెస్ రూమ్‌లో ల్యాండ్ లైన్. ఓ జర్నలిస్ట్ తన వంతు వచ్చే వరకు నిలబడి, మెల్లిగా ఫోన్‌లో సచివాలయంలో బాబు ఛాంబర్‌లో ఎంత మంది శాసన సభ్యులు చేరారో రామోజీ రావుకు చెబుతున్నాడు ఆ సాయంత్రమే శిబిరం వైస్‌రాయ్‌కి మారింది.

ప్రభుత్వాన్ని కూల్చడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న వారు కూడా అంత మెల్లిగా తన పని తాను చేసుకు పోతుంటే మందు మత్తులో అమెరికా అధ్యక్షుడ్ని కూడా ప్రెస్‌రూమ్ నుంచే మార్చేస్తున్నట్టు మాట్లాడే వారిని కూడా చూశా. ప్రపంచంలో ప్రతి పరిణామంపై సమీక్షించే మనం మన జీవితాన్ని కూడా సమీక్షించుకోవాలి లేదంటే?


ఆరోగ్యం, మానవ సంబంధాలు, డబ్బు అన్నీ జీవితానికి ముఖ్యమే. బెంగళూరులో ఒక సీఏ ఆఫీస్‌లో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారట. అంత్యక్రియలకు ఎవరూ రాలేదట. వాస్తవం ఇలానే ఉంటుంది. భ్రమలు వదిలి వాస్తవం లోకి రావాలి.

ఓ వీడియో వింటుంటే నూతన్ ప్రసాద్ గురించి యండమూరి వీరేంద్రనాథ్ ఓ మాట చెప్పారు. సినిమా షూటింగ్ ప్రమాదంలో నడుము వరకు చచ్చుపడడంతో నూతన్ ప్రసాద్ వీల్ చైర్ కే పరిమితం అయ్యారు. జీవితంలో అనుకోకుండా వచ్చే ప్రమాదాలకు ముందే సిద్ధం అయి ఉంటే ప్రమాద తీవ్రత తక్కువగా ఉంటుంది అని చెప్పారట. ఏ ఉద్యోగంలో ఉన్న వచ్చే ప్రమాదాలను ముందే ఊహించుకుంటే జీవితం అగమ్య గోచరంగా ఉండదు. సీఎం తెలుసు, పీఎం తెలుసు అంటూ భ్రమల్లో బతికితే మాత్రం??? **(వాట్సప్‌లో ప్రచురితమైంది)**

# ఈటీవీ బ్యూరో చీఫ్ ఆదినారాయణ హఠాన్మరణం



సీనియర్ జర్నలిస్టు, ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ టి.ఆదినారాయణ (48) సెప్టెంబరు 26వ తేదీ హఠాన్మరణం పాలయ్యారు. ఆయన ఈటీవీలో సుమారు 25 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్నారు. మియాపూర్ సమీపంలోని హఫీస్ పేటలో ఆదినారాయణ తాను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ భవనంపై ఉదయపు నడకకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు గారి కింద పడ్డారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆదినారాయణకు భార్య రమాదేవి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం పెదయాచవరంలో పేద రైతు కుటుంబంలో ఆదినారాయణ జన్మించారు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ వరకు సంక్షేమ వసతి గృహాల్లోనే చదువుకున్నారు. పాత్రికేయ వృత్తిపై ఆసక్తితో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ జర్నలిజం పూర్తి చేశారు. 2000 సంవత్సరంలో ఈటీవీ విలేకరిగా చేరారు. అంచలంచలుగా ఎదిగి ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ స్థాయికి చేరుకున్నారు. ఆయన మరణం పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్.ఎ.జె) సెక్రటరీ జనరల్ ఎన్ కొండయ్య, కోశాధికారి ఏ అమరయ్య, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఎ.పి.బి.జె.ఎ) కన్వీనర్లు వి.శ్రీనివాసరావు, కె.మునిరాజు, ఎన్ఏజే తెలంగాణ కన్వీనర్ ఎంఏ రవూఫ్‌లు సంతాపం వ్యక్తం చేశారు. ఆదినారాయణ ఇకస్మిక మృతి పట్ల రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అన్ని రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.



# సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దు

సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దని, ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సెప్టెంబరు 24న తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో తెలుగు రీజియన్ మళయాళీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూన్ పేరిట కార్టూన్ ఎగ్జిబిషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ కలిసి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ జానపద గిరిజన కళారూపాల సంప్రదాయంలో గుస్సాడీ, డప్పు కాళాకారుల విన్యాసాలతో సోమనాథ్‌కు ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ.. యువకుడిగా ఉన్నప్పుడు తాను కార్టూన్లు వేసేవాడనని, తనకు కార్టూనిస్ట్‌లు అన్న కార్టూన్ లో ఉండే చమత్కారం అన్న ఎంతో ఇష్టమని అన్నారు. ప్రఖ్యాత కార్టూన్ సిరీస్ టిన్ టిన్ లో వేసిన స్పేస్ షిప్ కార్టూన్ తనను ఎంతో ఆశ్చర్యపరిచేదని , ఇప్పుడుభారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కు అధినేత కావడం ఆనందంగా ఉందని చెప్పారు. భారతదేశం అతి తక్కువ కాలంలో, అతి తక్కువ బడ్జెట్‌తో విజయాలు సాధిస్తుందని, దానికి కారణం మన సైంటిస్టులే అని.. విక్రం సారబాయ్‌తో మొదలెపెట్టిన ప్రస్థానం ఇప్పుడు చంద్రయాన్ 3 వరకు ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు. కొత్తగా ఈ రంగాన్ని ఎంచుకునే వారికి సహకారం, ప్రోత్సాహం అందించి కొత్త కార్టూనిస్టులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత సీనియర్ కార్టూనిస్ట్‌లపై ఉందని వ్యాఖ్యానించారు. స్పేస్ థీమ్ తో కార్టూన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన భాషా, సాంస్కృతిక శాఖను ఈ సందర్భంగా అభినందించారు. అంతరిక్ష పరిశోధనకు సంబంధించి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సోమనాథ్ సమాధానిమిచ్చారు.

అంతకుముందు మంత్రి జూపల్లి మాట్లాడుతూ కార్టూన్ అంటే మూడక్షరాలే కానీ ఆ కార్టూన్‌లో కనిపించే మూడు గీతల్లోనే ముప్పై అర్థాలు దాగి ఉంటాయన్నారు. కార్టూన్లు–ఆలోచింపజేస్తాయని అందుకే కార్టూన్లంటే అందరికీ ఇష్టమేనని, కార్టూన్ అసామాన్యులనే కాదు, సామాన్యులను కూడా ప్రభావితం చేయగల కళ అని అభిప్రాయపడ్డారు. ప్రముఖ కార్టూనిస్టులు కె. శంకర్ పిళ్ళై, ఆర్‌కె లక్ష్మణ్, ఇ.పి. ఉన్నీ లాంటి ఎందరో కార్టూనిస్టులు కార్టూన్ రంగాన్ని సుసంపన్నం చేసారని తెలిపారు. సమకాలీన రాజకీయాలపై ఆర్కే లక్ష్మణ్ కార్టూన్లు చాలా కటువుగా ఉండేవని చెప్పారు. ప్రస్తుతం అన్ని కళాకారులతో పాటు కార్టూనిస్టులకు కూడా కేరాఫ్ అడ్రస్ గా తెలంగాణ ఉందని, అందుకే తెలంగాణ ప్రభుత్వం కార్టూనిస్టులను కూడా సగౌరవంగా ప్రోత్సహిస్తూ వస్తున్నదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేష్, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సిటిఆర్ఎంఎ, టిఈడిఎస్, సిఎల్ఐసి అధ్యక్షులు లిబి బెంజమిన్, కేరళ కార్టూన్ అకాడమీ చైర్మన్ సుధీర్ నాథ్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకర్, కార్యదర్శి మృత్యుంజయ్, కార్టూనిస్టులు సుభాని, నర్సిం, వెంకటేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసుల నమోదు తగదు

### సుప్రీంకోర్టు ఉత్తర్వుల అమలుకు ఆదేశం

సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ 66ఎ అక్రమమని 2015లో శ్రేయా సింఘాల్ కోర్టుకు వెళ్లారు. ఈ కేసు విచారణ జరిపిన అనంతరం సుప్రీంకోర్టు ఐటి చట్టంలోని 66ఎ సెక్షన్ రద్దుచేస్తూ 2015 మార్చి 24న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల కారణంగా భారతదేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో సమాచార సాంకేతిక చట్టం సెక్షన్ 66ఎ కింద కేసులు నమోదు చేసి ఉంటే వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ రాష్ట్రాల్లో 2000 సంవత్సరం తరువాత కూడా పోలీసులు రద్దయిన ఈ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చిన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రస్తావించి ఈ ఉత్తర్వులను జారీ చేసింది. అన్ని రాష్ట్రాల్లోని చట్టాలను అమలుచేసే వ్యవస్థలకు ఈ అంశంపై అవగాహన పెంచేందుకు వీలైన చర్యలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటిని ఖాతరు చేయకుండా కేసులు నమోదు చేసిన పక్షంలో తీవ్రంగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించింది.

Most Immediate
Supreme Court matter

No. 21021/46/2016-IS-II/M
Government of India
Ministry of Home Affairs

To,

1. Chief Secretaries of States/ Administrators of UTs,
2. DGPs of all States / UTs

**Subject: Regarding implementation of Hon'ble Supreme Court Order dated 24.03.2015 on striking down of section 66A of the Information Technology Act, 2000.**

The undersigned is directed to refer to the judgment of the Hon'ble Supreme Court given in the matter of Shreya Singhal Vs. Union of India on 24.03.2015, whereby Section 66A of the Information Technology Act, 2000 was struck down, becoming null and void with effect from the date of order i.e. 24.03.2015 and hence no action could be taken under this section. In this connection, all States & UTs were advised vide MeitY DO letter no.4(13)/2012-CLFE/Vol.II dated 11.01.2019 and MHA letter No. 21021/46/2016/IS-II-M dated 14.01.2019 and 01.04.2019, to sensitise the police department / local police authorities in your State / UT for strict compliance of the Hon'ble Supreme Court order dated 24.03.3015 and withdrawal of the all such cases, if any, which were booked under the section 66A of the IT Act,2000 in your State / UT.

2. It has been brought to our notice through an application in Hon'ble Supreme Court that FIRs are still being lodged by some police authorities under the struck down provision of Section 66A of IT, Act, 2000. Hon'ble Supreme Court has taken a very serious view in the matter.

3. It is therefore, requested to direct all the police stations not to register cases under the repealed Section 66A of the information Technology Act,2000 and sensitise the law enforcement agencies for the compliance of the order issued by the Hon'ble Supreme Court on 24.03.2015. If any case has been booked in your State under section 66A of the IT Act, 2000, it should immediately be withdrawn.

S

14/7

(Shailendra Vikram Singh)
Deputy Secretary (CIS)
North Block, New Delhi
Dated: 14 July, 2021



## కెమెరామెన్ గుణ మృతి

శ్రీకాకుళం జిల్లాలో స్వతంత్ర టివిలో కెమెరామెన్‌గా పనిచేస్తున్న గుణ సెప్టెంబరు 23వ తేదీ ఉదయం మరణించారు. గుణ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో జేమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యసహాయం అందినప్పటికీ గుణ అకాలమృతి చెందారు. గుణ మృతి పట్ల శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సదాశివుని కృష్ణ, లక్ష్మణరావులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



# జర్నలిస్టుల ఆరోగ్య బీమాకు మంత్రి సవిత తోడ్పాటు

అనంతపురం జిల్లా పెనుకొండ నియోజకవర్గం జర్నలిస్టుల ఆలోగ్య బీమా పథకానికి మంత్రి సవిత వారి వాటా సొమ్మును చెల్లించి తోడ్పడింది. ప్రభుత్వం కొన్నేళ్లుగా జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద 1250 రూపాయలు జర్నలిస్టు తమ వాటాగా చెల్లిస్తే అంతమొత్తం ప్రభుత్వం కలిపి ఆరోగ్య బీమా ట్రస్టుకు చెల్లిస్తుంది. ఈ నియోజకవర్గంలోని 45మంది జర్నలిస్టులకు వారి వాటా ధనాన్ని చెల్లించేందుకు మంత్రి సవిత సుముఖత వ్యక్తం చేయడంతో పాటు ఆ మొత్తాన్ని చెల్లించింది. మంత్రి అందించిన తోడ్పాటునకు ఫెడరేషన్ అనంతపురం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షఫీ, ఆర్.రామాంజనేయులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

---

# ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు బియ్యం కిట్ల పంపిణీ



ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 17వ తేదీ ఉదయం సింగ్ నగర్ ఫ్లైవోవర్ దిగువన వున్న పెట్రోల్ బంక్ ఆవరణలో విజయవాడ వరద బాధితులకు బియ్యం, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. సింగ్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ ఇతర ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు 500 కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. గోరంట్లప్ప, ప్రజాశక్తి బ్యూరో చీఫ్ వి. సురేష్, సీనియర్ జర్నలిస్ట్ ఎన్. పవన్ కుమార్, ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కలిమిశ్రీ, సభ్యులు సురేష్ బాబు కుర్రా, చొప్పా రాఘవేంద్రశేఖర్, విజయవాడ వెస్ట్ కమిటీ అధ్యక్షులు నరేంద్ర, కార్యదర్శి ఫణికుమార్, ఎమ్మిగనూరు కమిటీ అధ్యక్షులు ఎస్.కె. షబ్బీర్, గౌరవాధ్యక్షులు దేవేంద్రమూర్తి, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు వై. వెంకటేష్, కార్యదర్శి దేవీశంకర్, కోశాధికారి ఖాదర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల దసరా సంబరాల ఏర్పాట్లు

ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో అక్టోబర్6న విజయదశమి(దసరా) పర్వదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షుడు పి.నారాయణ్ తెలిపారు. ఈ మేరకు సెప్టెంబరు 19వ తేదీ అక్కయ్యపాలెం వద్ద ప్రైవేట్ హోటల్‌లో మూడు యూనియన్ల కార్యవర్గాలు సమావేశం నిర్వహించారు. చిన్నపత్రికల సంఘ ఏర్పాటు జరిగిన తరువాత మూడు సంఘాలు కలిపి ఉమ్మడిగా చేస్తున్న తొలి కార్యక్రమం ఇది. ఈ సమావేశం ప్రధానంగా దసరా ఏర్పాట్లపై చర్చించింది. దానితో పాటు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేయవలసిన కార్యాచరణ గురించి చర్చించారు. అనంతరం ఇందుకు సంబంధించిన వివరాలను శ్రీనుబాబు, నారాయణన్‌లు వెల్లడించారు. 6వ తేది ఉదయం అల్పాహారంతో దసరా సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం నగరానికి చెందిన వివిధ సంస్థల కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల కోసం లక్కీడిప్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విందు భోజనంతో పాటు మిఠాయిల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు దసరా సంబరాల్లో పాల్గొని జయప్రదం చేయాలని వీరు కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ డిప్యూటీ సెక్రటరీ ఎ.సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, పితాని ప్రసాద్, బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరరావు, మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్, శ్రీనివాసరావుతో పాటు ఆయా కార్యవర్గాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరైయ్యారు.

**సాయిరాం సత్యనారాయణ మృతి పట్ల నివాళి**

ఇటీవలే మృతి చెందిన సాయిరాం పార్లర్ అధినేత తాళ్లూరి సత్యనారాయణ, ఫెడరేషన్ నగర కార్యదర్శి జి. శ్రీనివాసరావు తండ్రి అప్పారావు, ఆంధ్రప్రభ జాతీయ దినపత్రిక సర్క్యులేషన్ అధికారి రావు మృతి పట్ల జర్నలిస్టులు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# కష్టాల కడలిలో జర్నలిస్ట్



**పోతుమహంతి నారాయణ్ పట్నాయక్**
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్
విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు

స్వాతంత్ర్య పోరాటంలో జర్నలిస్టులు పోషించిన పాత్రను ప్రక్కన పెడితే గడిచిన అర్ధ శతాబ్దంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తొలినాళ్లలో జర్నలిజం అనేది ఒక వృత్తిగా ఉండేది, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 2000 సంవత్సరం వరకు ప్రతి జర్నలిస్టు వృత్తిని దైవంగా భావిస్తూ రాసే వార్తలపై విశ్లేషణ చేసుకునేవారు. కాలక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగ ప్రవేశం చేశాక ప్రింట్ మీడియాకు ఎంతో కొంత ఆదరణ తగ్గింది. చిన్న పత్రికల్లో పని చేసేవారు వార్తలు రాయడంతో పాటు ఎక్కువగా ప్రకటనల కోసం తిరగడం మొదలుపెట్టారు. తద్వారా పత్రికలకు అడ్వర్టైజ్మెంట్ రూపంలో ఎంతో కొంత ఆదాయం సమకూర్చే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. ప్రింట్ మీడియా కేవలం అడ్వర్టైజ్మెంట్ల మీదే ఆధారపడుతున్న నేపథ్యంలో ఆ మీడియాలో పనిచేస్తున్న పాత్రికేయులు సహజంగా వార్తలతో పాటు అడ్వర్టైజ్మెంట్ల కోసం కూడా తిరగడం తప్పడం లేదు. ఈ నేపథ్యంలో పాఠకునికి నాణ్యమైన వార్తలు చేరడం లేదనే చెప్పాలి. మరో వైపు తప్పులు మీద తప్పులు జరుగుతునే ఉన్నాయి.

అయితే ఈ స్పీడ్ యుగములో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. దీంతో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు ఆదరణ తగ్గుతూ వస్తోంది. జర్నలిస్ట్ అనేవాడు వృత్తిపరమైన అంశాల కంటే ఇతరత్రా వ్యవహారాల జోలికి వెళ్లడం గత 20 ఏళ్లుగా జరుగుతూ వస్తోంది. పర్యావసానంగా విమర్శలు మూటగట్టుకోవల్సి వస్తోంది. దీనికి ప్రధాన కారణం జర్నలిస్టులకు నెలసరి ఆదాయం అంతంత మాత్రంగా ఉండడం కుటుంబ పోషణ భారం పెరగడం, పాలకుల ఆదరణ లేకపోవడం, యాజమాన్యాలు పూర్తిస్థాయిలో సహకరించకపోవడంతో జర్నలిస్టులు కూడా మిగిలిన వృత్తుల మాదిరిగా పక్క చూపులు చూడక తప్పడం లేదు. అయితే జర్నలిజం విలువలు రోజురోజుకు క్షీణిస్తున్నాయని అనేవారు కూడా లేకపోలేదు. అన్ని వృత్తులు మాదిరిగానే జర్నలిజం కూడా ఎంత కొంత అపవిత్రతను మూట గట్టుకుందని చెప్పాలి. ఈ వ్యవస్థ మారుతుందా లేదా అనేది పక్కన పెడితే కాలంతోపాటు నడవక తప్పడం లేదనే వారూ ఉన్నారు. అయితే కొత్తగా వృత్తిలోకి వస్తున్న వారికి శిక్షణ ఉండడం లేదు. యాజమాన్యాలు కూడా దానిపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. దీంతో పదాల కూర్పు దగ్గర తప్పటడుగులు వేస్తున్నారు. వార్త రాసే జర్నలిస్టు ఒకటి రెండుసార్లు దాన్ని చదువుకునే సందర్భాలు కూడా తక్కువగానే ఉన్నాయి. దీంతో వార్తల్లో దృఢత్వం తగ్గుతోంది. ప్రతిరోజు అనేక ఇబ్బందులు పడుతూ వృత్తిపరంగా అడుగులు వేయడం వల్ల ఏకాగ్రత తగ్గిందనే చెప్పాలి, మరోవైపు జర్నలిస్టుల సంఖ్య అపరిమితంగా పెరుగుతూ వస్తోంది, ఇదివరలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా పార్ట్ టైం జర్నలిస్టులుగా పని చేసేవారు. ఇప్పుడు అది పోయింది. మరోవైపు సమాచార పౌర సంబంధాల శాఖ ప్రెస్ నోట్ లు విడుదల చేయడం మినహా జర్నలిస్టుల స్థితిగతులను తెలుసుకోవడం, వృత్తి పరమైన నైపుణ్యం పెంపొందించడం వంటివి చేయడం లేదు. ప్రెస్టూర్లు వంటివి పూర్తిగా మానేశారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ గత కొన్నేళ్లుగా జర్నలిస్టులను గుర్తించిన సందర్భాలు లేవనే చెప్పాలి, ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల స్థితిగతులు మారడం లేదు ఇందుకు సంబంధించి లోతుగా అధ్యయనం చేస్తున్న సందర్భాలు కూడా లేవు, కేంద్ర ప్రభుత్వం రైల్వే పాస్ లను పూర్తిగా తొలగించింది రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు మెడీ క్లెయిమ్ సదుపాయం మాత్రమే కలుగచేస్తోంది. పింఛను సదుపాయం లేదు. ఈ పరిస్థితుల్లో కష్టాలు పడుతున్న జర్నలిస్టులకు దారేటో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. జర్నలిస్టుల ఇళ్ళు, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.. అక్రిడేషన్లు జారీలో సరళతరమైన విధానాలు ఉండాలి. ఈ దిశలో ప్రభుత్వం చర్యలు చేపడితే వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న జర్నలిస్టులకు ఎంతో కొంత ప్రయోజనం చేకూరుతుంది..

# పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యం

## రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి

ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా సమాచార పౌరసంబంధాల శాఖలో పనిచేసే అధికారులు,ఉద్యోగులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకుని మరింత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్ధసారధి చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సెప్టెంబరు 12వ తేదీ సమాచార శాఖ క్షేత్రాధికారుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాచారశాఖ అంటే ప్రభుత్వానికి కళ్ళు, చెవుల వంటిదని ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించుటలో ఈశాఖ ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా అందరూ పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యంగా ప్రస్తుత ఆధునిక సాంకేతికతను అలవర్చుకుని అధికారులు ఉద్యోగులు వారి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకు అవసరమైతే ఆయా రంగాలకు చెందిన నిపుణులతో ఉద్యోగులకు తగిన శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలని సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లాకు మంత్రి పార్ధసారధి సూచించారు.

ప్రస్తుతం సమాచారశాఖ అమలు చేస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్‌ను మరింత సమర్ధవంతంగా నిర్వహించడం ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాల సమాచారాన్ని సకాలంలో ప్రజలకు చేరవేసేందుకు కృషి చేయాలని మంత్రి పార్ధసారధి చెప్పారు.

ప్రభుత్వ ప్రతిష్టను పెంపొందించే రీతిలో సమాచార శాఖ అధికారులు, సిబ్బంది పనిచేయాలని అన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్ళి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వంపై ఎక్కడైనా మీడియాలో గాని లేదా సోషల్ మీడియాలో గాని వ్యతిరేక వార్తలు వస్తే వెంటనే సంబంధిత జిల్లా లేదా రాష్ట్ర స్థాయి అధికారులను సంప్రదించి వివరణ ఇవ్వడం ద్వారా వాస్తవాలను తెలియజేయాలని మంత్రి పార్ధసారధి సమాచారశాఖ అధికారులకు స్పష్టం చేశారు.

ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన శాఖల వారీగా పూర్తి సమాచారాన్ని సేకరించి ప్రత్యేక డేటా బ్యాంకును ఏర్పాటు చేసుకునేందుకు తగిన మెకానిజాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకై ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసుకోవాలని మంత్రి పార్ధసారధి చెప్పారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన విజయగాధలను మీడియాలో ప్రచురిత మయ్యేలా చూడాలని అన్నారు.

అనంతరం జర్నలిస్టుల ఆరోగ్య పథకం,అక్రిడిటేషన్ ఇతర అజెండా అంశాలపై చర్చించారు. వివిధ ఖాళీల భర్తీ, వాహనాలు సమకూర్చడం వంటి ఇతర వ్యవస్థాపరమైన అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని దానిపై ముఖ్యమంత్రి వర్యులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి పార్ధసారధి చెప్పారు.

ఈసమావేశంలో సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా మాట్లాడుతూ అక్టోబరు 31 లోగా నూతన అక్రిడిటేషన్ విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. అదే విధంగా జర్నలిస్టుల ఆరోగ్య పథకంలో కూడా కొన్ని మార్పులు తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సమాచారశాఖ అధికారులు, సిబ్బంది మరింత సమర్ధవంతంగా పనిచేయాలని, సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు, పథకాలపై ఎప్పటి కప్పుడు ప్రత్యేక కథనాలు, విజయగాధలు మీడియాలో ప్రచురితమయ్యే విధంగా పనిచేయాలని చెప్పారు.

అనంతరం జిల్లాల వారీగా ఖాళీలు,సమకూర్చాల్సిన వాహనాలు ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సమాచార సంయుక్త సంచాలకులు, ముఖ్య సమాచార ఇంజనీర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్లు, ఎడిలు, డిఐ పిఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.



# సీతారాం ఏచూరికి ఫెడరేషన్ నివాళి

పీపుల్స్ డెమోక్రసీ పత్రిక ఎడిటర్, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సీతారాం ఏచూరి మరణం తీరని లోటు అని ఏపీ డబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ వరదరాజులు అన్నారు. చిత్తూరు నగరం గాంధీ విగ్రహం వద్ద సీతారాం ఏచూరి చిత్రం పటానికి జర్నలిస్టులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) చిత్తూరు జిల్లా కన్వీనర్ వరదరాజులు మాట్లాడుతూ కమ్యూనిస్టు భావజాలంతో భారత దేశ అభివృద్ధికి సీతారాం ఏచూరి సేవలు అందించారని తెలిపారు. రచయితగా, పత్రిక ఎడిటర్‌గా, రాజకీయవేత్తగా కమ్యూనిస్టు యోధుడుగా సీతారాం ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనలో జర్నలిస్టులు పునరంకితం అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కోకన్వీనర్ జయప్రకాష్, సీనియర్ జర్నలిస్టులు జయరాజ్, వీరరాఘవ నాయుడు, ఉమాశంకర్, బాలసుబ్రమణ్యం, నాగరాజు, కుబెంద్రన్, తులసిరామ్ రెడ్డి, మురళి, ధరణిధర్, రాజేంద్ర నాయుడు, కృపానందరెడ్డి, కేశవులు, సత్యం ప్రసాద్, జయచంద్ర, యాదవేందర్ రెడ్డి, దినేష్ కుమార్, ప్రకాష్, సురేంద్ర రెడ్డి, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఫెడరేషన్ గుంటూరు జిల్లా కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా కన్వీనింగ్ కమిటీ నూతనంగా ఏర్పాటయింది. స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో సెప్టెంబరు 18వ తేదీ సాయంత్రం జరిగిన సమావేశంలో కమిటీని ఎంపికచేశారు. సమావేశానికి ఫెడరేషన్ నాయకులు ఎస్.ఎస్. జహీర్ అధ్యక్షతన వహించారు. జిల్లా కన్వీనర్‌గా ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కనపర్తి రత్నాకర్, గుంటూరు ఈస్ట్ కో కన్వీనర్లుగా పి. సాయి కుమార్, వరదల మహేష్ గుంటూరు వెస్ట్ కో కన్వీనర్లుగా అజయ్ ఇండియన్, వేముల రాజేష్, తెనాలి కో కన్వీనర్‌గా ఎమ్. శ్రీకాంత్, పొన్నూరు కో కన్వీనర్లుగా అత్తోట సంజయ్, కె.కృష్ణ, మంగళగిరి కో కన్వీనర్‌గా చింతా మణి కుమార్, తాడికొండ కో కన్వీనర్లుగా ఎన్. జె.శామ్యూల్, సయ్యద్ కరిముల్లా, పత్తిపాడు కె. పుల్లారావులు ఎంపికయ్యారు. త్వరలో ఫెడరేషన్ జిల్లా మహాసభ జరగనుందని నూతనంగా కన్వీనర్ గా బాధ్యతలు స్వీకరించిన రత్నాకర్ తెలిపారు. సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.






# ఎమ్మిగనూరులో వరదబాధితులకు విరాళాల సేకరణ

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో విజయవాడ వరద బాధితుల సహాయార&థం ఏపిడబ్ల్యుజెఎఫణ ఆధ్వర్యంలో సెప్టెంబరు 11న విరాళాల సేకరణ జరిగింది. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు ఎమ్మిగనూరులోని పోలీసు శాఖ, మునిసిపలణ సిబ&బంది, విద్యుతణ శాఖకు చెందిన సిబ&బంది తమ వంతు సహకారాన్ని అందజేశారు. తోటివారికి కష్టం వచ్చినపుడు ఎంతగా స్పందిస్తారో ఇది పెద్ద ఉదాహరణ అని కార్యక్రమంలో భాగస్వాములైనవారందరూ అభిప్రాయపడ్డారు. ఫెడరేషనణ ఎమ్మిగనూరు శాఖ నుంచి గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్, మూర్తి, ఇలియాస్, నాగరాజ్, శంకర్, మునీర్, వెంకటేష్ మిత్రులు అన్వర్ బాషా, గ్రందే గిరి షహీద్ అఫ్రిది, డాక్టర్ వి.రాయల్ బాబు, మహబూబ్,షేక్ష, రఘునాధ్ షెక్షవలి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





చదవండి! చదివించండి!!

వర్కింగ్ జర్నలిస్ట్
సమాచార స్రవంతి



# ఘనంగా అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ప్రమాణ స్వీకారం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, అనకాపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సెప్టెంబరు 10వ తేదీ అనకాపల్లి వివేకానంద హాల్లో ఘనంగా జరిగింది. గతవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా సిహెచ్ శశికుమార్, ప్రధాన కార్యదర్శిగా పొలిమేర నాగ శ్రీనివాసరావు, కోశాధికారిగా మొల్లెటి గంగాధర్, ఉపాధ్యక్షుడిగా కాండ్రేగుల సతీష్, జాయింట్ సెక్రటరీగా పెంటకోట సురేష్ లను సంఘ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ఈశ్వరరావు లు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, యూనియన్ బలోపేతం దిశగా నూతన కార్యవర్గం పనిచేయాలని వారు సూచించారు.




ఈ సందర్భంగా అనకాపల్లి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు బయ్యా కొండల రావు, మాజీ కార్యదర్శి రామకృష్ణ లను నూతన కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం అనకాపల్లి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు సిహెచ్ శశి కుమార్ కుమార్ మాట్లాడుతూ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా కార్యవర్గ సభ్యులందరూ కృషి చేస్తామని ,యూనియన్ బలోపేతానికి పారదర్శకంగా పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తిమ్మాపాత్రుని రమేష్, సీనియర్ జర్నలిస్ట్ అజయ్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ఎస్.కె చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతర సహకారం




నిరంతరం సమాజం కోసం పాటుపడే జర్నలిస్టులకు తన పరిధి మేరకు సహాయం,సహకారము అందిస్తానని ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కంచర్ల అచ్చుతరావు అన్నారు. విశాఖపట్నంలో సెప్టెంబరు 10వ తేదీ ఇక్కడ పౌర గ్రంథాలయంలో ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ జర్నలిస్టుల దినోత్సవంను పురస్కరించుకొని పలువురు జర్నలిస్టులను కంచర్ల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పరిధి మేరకు జర్నలిస్టులకు సహాయం చేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. తాను చేసే వ్యాపారంలోవచ్చిన లాభాల్లో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నట్లు కంచర్ల వివరించారు. ఒకరికి సహాయం అందించడం వల్ల కలిగే పుణ్యఫలం ఎంతో మంచిదన్నారు. విశాఖ నగరంలో జర్నలిస్టులకు తాను అండగా ఉంటానన్నారు. తాను తీసిన సినిమాల్లో వచ్చిన లాభాల్లో కూడా కొంత మొత్తాన్ని జర్నలిస్టులు సంక్షేమానికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల కార్యదర్శి గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులు సంక్షేమమే లక్ష్యంగా తమ యూనియన్లు పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్క జర్నలిస్టుకు ప్రభుత్వ పరంగా అందించే పథకాలన్నీ చేరే విధంగా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన తమ సంఘాల ద్వారా భవిష్యత్తులో కూడా అక్రిడిటేన్లు, ఇళ్ల స్థలాలు, ప్రమాద భీమా వంటి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖ అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి నారాయణ మాట్లాడుతూ నగరంలో ఉన్న జర్నలిస్టులకు తమ యూనియన్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. విజయ దశమి పర్వదినం కూడా ప్రతీ యేటా ఘనంగా నిర్వహించడం జరుగుతుంది అన్నారు.

ఏపీ. బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు కార్యదర్శి మదన్‌లు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడుతున్నట్లు వీరు వివరించారు. పలువురు జర్నలిస్టులను తమ యూనియన్ ద్వారా సత్కరించడం సంతోషం కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా అతిథిలతో పాటు వేర్వేరు చానల్స్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను అంతా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల జర్నలిస్టులు పాల్గొన్నారు.





# జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

## పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరవాడ :- జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు హామీ ఇచ్చారు. సోమవారం పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లాలం కృష్ణారావు మరియు పిఎస్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ 5వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక మరిడిమాంబ కళ్యాణ మండపంలోసోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. జర్నలిస్టులకు భీమా సౌకర్యం కల్పిస్తామని అదే విధంగా జర్నలిస్టుల పిల్లలకు 50శాతం రాయితీపై ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు చెల్లించే అవకాశం ఏర్పాటు చేస్తామని వివరించారు. జర్నలిస్టులకు సాయ పడాలనేదే తన అభిమతమని అదేవిధంగా పరవాడలో ఏర్పాటు చేయనున్న ప్రెస్ క్లబ్ కు స్థలం కూడా కేటాయించనున్నట్లు వివరించారు. జర్నలిస్టులతో తనకు అవినాభావ సంబంధం ఉందని సమాజానికి మేలు చేసే జర్నలిస్టులంటే తనకెంతో ఇష్టమని ప్రతి జర్నలిస్టుకు వ్యక్తిగతంగా సాయం చేయాలన్నదే తమ కోరిక అన్నారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులకు తగు సహకారం అందజేస్తానని రమేష్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టుల పిల్లలకు ఉపకారవేతనాలు, వృద్ధులకు దుప్పట్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైలా వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, మాజీ ఎంపిపిలు పైలా జగన్నాథరావు, నీలబాబు, అప్పలనాయుడు, విశాఖపట్నం జిల్లా ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్షులు వి.నారాయణ్, డిప్యూటీ సెక్రటరీ ఎ.సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, ఆనంద్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి ఈశ్వరరావు, పరవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎల్.కృష్ణారావు, సెక్రటరీ పైలా సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.






Simone Weil, French political activist, myst and philosopher with openness, receptivity and heart to beat the world.

Simone Adolphine Weil was born in Paris on 3.2.1909 to Bernard Weil, a medical doctor, an agnostic Alsatian Jew and First World War hero. Weil was brilliant, progressive in college, an ideal teacher, nicknamed as Red Virgin. She called herself a Bolshevik. Theorised power and bureaucrats loot more than the capitalists. Used philosophy and religion committedly to know the world. Studied Christian conceptions to negate God. Worked as teacher, helped students to develop, in an automobile factory to know the difficulties of workers, participated in the Spanish Civil War, volunteered for dangerous wartime missions behind enemies. These led to her early death at 34 on 24.8.1943.

---

Protesters surrounded Soviet tanks. On 20.8.1968 Soviet and Warsaw Pact troops inveded Czechoslovakia.



In Jan 1968 Alexander Dubcek became leader of communist Czechoslovakia. He implemented 'socialism with a human face'. Granted rights to citizens, democratised and deregulated economy, freed media, travel and speech. Reforms were not accepted by Soviet Union, of which Czechoslovakia was satellite state. After failed talks, 2.5 L Soviet, Warsaw Pact allies invaded Czechoslovakia on 20.8.1968. Crushed resistance. Arrested Dubcek on 21.8.1968. Forced to resign. Soviet troops were in Czechoslovakia until 1991. Normalcy restored on reversing reforms and removing reformers from govt. In 1989 Communism collapsed in Czechoslovakia, which was split into Czech Republic and Slovakia in 1993.

---

Young Turks declared reforms and rights to all in Ottoman Empire regardless of race or religion on 16.8.1908.

Ismail Enver Pasha was leader of Young Turk Revolution. It brought multiparty politics in Ottoman Empire. Pasha came to power in a coup in 1913. Ruled the country upto 1918. Was War Minister too. Entered World War I siding Germany. Responsible for the Armenian Genocide. Killed 8 to 18 lakhs Armenians. After the collapse of Ottoman war effort, the Sultan Mehmed VI dismissed Pasha and his colleagues. They fled into exile. They were tried in absentia 'for plunging the country into war without reason, deportation of Armenians and leaving the country without permission' and sentenced to death. He later died on 4.8.1922, at 40, in a combat leading a brigade of rebels in the Soviet Union.

Vijaya Lakshmi Pandit, Indian Diplomat and politician, was born in Allahabad, India on 18.08.1900.



Born as Swarup, Vijaya Lakshmi Pandit is daughter of Motilal & sister of Jawaharlal Nehru. Married Ranjit Sitaram Pandit, Freedom Fighter, died at 33 in jail. Vijaya Lakshmi played key role in Freedom Struggle, was jailed many times. In 1937 she became the first Indian woman to hold a cabinet post in pre-Independent India. In 1946 she was elected to the Constituent Assy. She served as India's ambassador to Russia, US, Mexico, Ireland, UK & Spain. In 1953 became the first woman Prez of UNO Genl Assy. Was Guv of Maharashtra and Parliament Member. She criticised her niece Indira for the emergency. She fought for women's and Hindu Widows' rights. Died at 90 on 1.12.1990.

---





George Orwell published 'Animal Farm', an allegorical Novel in the United Kingdom on 17.8.1946.

Eric Arthur Blair, pen named after River Orwell, as George Orwell, was born in Motihari, Bengal Presidency (now Bihar) British India. His father was Indian Civil Servant in Opium Dept. Orwell was colonial policeman in Burma and fought against fascists in the Spain civil war. He was novelist, poet, essayist, journalist and critic. In 2008 The Times named him the second greatest British writer since 1945. He opposed totalitarianism, both left-wing authoritarian communism and right wing fascism and supported Democratic Socialism. His most famous works are The Road to Wigan Pier, Animal Farm (rebellion beast fable) and Nineteen Eighty Four. Died on 21.1.1950 with pulmonary artery burst.

---

Mohammad Mosaddegh, Iran PM, was overthrown in a coup by America and the United Kingdom on 19.8.1953.



Mohammad Mosaddegh was democratically elected as the Prime Minister of Iran in 1951 by the Iranian Parliament Majlis. He introduced social and political reforms like social security, land reforms, tax on the rent on land etc. Nationalised the Iranian oil industry under British control since 1913. Britain and America couldn't tolerate these. Hence, he was overthrown in a coup orchestrated by the British Secret Intelligence Service named Operation Boot and American Central Intelligence Agency named Operation AJAX Project. General Fazlollah Zahedi, supported by CIA and SIS arrested Mosaddegh on 20.8.1953. Mosaddegh died at 84 on 5.3.1967.

# సమస్యలూ సవాళ్ళ "లేబర్ డే"!

## అమెరికన్ ట్రేడ్ యూనియన్ల పిలుపు

**-అమరయ్య ఆకుల**

'ఆశ, నిరాశల మధ్య సమాజం కొట్టుమిట్టాడుతున్నప్పుడు కార్మికోద్యమం దివిటీగా నిలిచింది. పురోగతికి బాటలు వేసింది. చోదక శక్తిగా నిలిచింది. కార్మికులు చిందించిన నెత్తుటి నుంచి, సాహసోపేతమైన పోరాటాల నుంచి సరికొత్త దారులు పరుచుకున్నాయి. ఆర్థిక, సామాజిక సంస్కరణలకు పుటక నిచ్చింది కార్మికోద్యమం. దిక్కూమొక్కూలేని అభాగ్యులకు, నిరుద్యోగులకు, వృద్ధులకు ప్రభుత్వం నుంచి ఉపశమనం దక్కేలా చేసింది. వీటన్నింటికి మించి కలిసికట్టుగా ఉండే ఉమ్మడితనాన్ని, భరాయించే తత్వాన్ని నేర్పింది కార్మికోద్యమం. ఈ మార్పు లేదా పరివర్తనకు నాయకత్వం వహించింది కార్మికులే తప్ప చాలామంది అనుకునేటట్టు పరిశ్రమాధిపతులు కానేకాదు. నిజానికి పరిశ్రమాధిపతులు ఎంతకాలం ప్రతిఘటించగలరో అంతకాలం అడ్డుకుంటూనే వచ్చారు. 1930లలో కార్మికోద్యమం ఉత్తుంగ తరంగంలా ఎగిసిపడింది. ఆ ఉద్యమమే మొత్తంగా దేశాన్నే సురక్షిత తీరాలకు చేర్చింది. మానవ ఆర్థిక స్థితిగతుల్ని మెరుగుపర్చింది. నాగరికత పెంపునకు బాటలు వేసింది. కలగా మిగిలిన భద్రత, గౌరవం, ప్రతిష్ఠలతో మనిషి తలెత్తుకుని బతికేలా చేసింది కార్మికోద్యమమే. ఇంతటి ఘన విజయాలు సాధించిన కార్మికోద్యమం మసకబారడం మేథో దివాలాకోరుతనానికి నిదర్శనం. చాలా మంది మేధావులు, మరికొన్ని వర్గాల ప్రజలు ఈ యూనియన్ ("%బఅఅశీఅ%") అనే పదం పలకడానికే నమోషి పడడం వారి స్వీయ మానసిక ధోరణికి, అధికార కాంక్ష, ముఠాతత్వం, ఏహ్యాభావానికి, పేదపురుగు మనస్తత్వానికి నిదర్శనం.

కార్మికోద్యమంలో తప్పులు లేవని కాదు, ఉద్యమాలలో పొరపాట్లు సహజం. కానీ అవి సాధించిన విజయాల మాటేమిటీ? పురోగతికి రాళ్లెత్తిన కార్మికుల చారిత్రక పోరాటాలకు దేశ చరిత్రలో దక్కిన వాటా ఎంత? ఇచ్చిన గౌరవం ఎంత? గత 30 ఏళ్లలో దేశ పునర్ నిర్మాణంలో రెండు మహా ఉద్యమాలు నడిచాయి. మొదటిది కార్మికోద్యమం. రెండోది పౌరహక్కుల ఉద్యమం. ఇది కాదనలేని చారిత్రక సత్యం.'

మార్టిన్ లూథర్ కింగ్(అక్టోబర్ 7, 1965. స్ప్రింగ్ ఫీల్డ్, ఇల్లినాయిస్.), ఆయన ఈ మాటలు చెప్పి నేటికి 60 ఏళ్లు కావొస్తోంది. ఇప్పటికీ అవన్నీ ఈటెల్లాంటి మాటలే. నిష్ఠూరపు తూటాలే. అమెరికాలో ట్రేడ్ యూనియన్లు ఓ వెలుగు వెలుగుతున్నప్పుడే ఆయన చీకటి కోణాలను చూశారు. రాబోయే సవాళ్లను ఊహించారు. జాగ్రత్త సుమా అని హెచ్చరించారు. మున్ముందు యూనియన్లకు ఎలా తూట్లుపొడుస్తారో అంచనా వేశారు. గ్రేట్ డిప్రెషన్ (మహా మాంద్యం) కాలంలోనూ కనిపించని అసమానతలు ఎలా పెరుగుతాయో అంకెలు సంకెలతో సహా ఊహించారు. ఇప్పుడు సరిగ్గా అదే జరిగింది.

**అమెరికాలో మేడే అంటే ...**

ఈవేళ అమెరికన్ లేబర్ డే. అంటే మన మేడే. ప్రపంచ వ్యాప్తంగా మే ఒకటో తేదీని అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా పాటిస్తే అమెరికా మాత్రం సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చే సోమవారాన్ని లేబర్ డేగా పాటిస్తోంది. ఆ రోజును ఫెడరల్ గవర్నమెంటు (అంటే కేంద్రప్రభుత్వం) సెలవు దినంగా పాటిస్తుంది. మనకు తెలిసిన మేడే అంటే కార్మికదినోత్సవం. అమెరికాలో మేడే అంటే ఓ గావుకేక. ఓ తరహా అత్యవసరపరిస్థితి. ఎవరైనా ఏదైనా ఆపదలో చిక్కుకున్నప్పుడు మేడేను ప్రకటిస్తారు. పోలీసులు రంగంలోకి దిగుతారు. అంతెందుకు.. బాగా ట్రాఫిక్ జామ్ అయినా మేడే అంటుంటారు. మేడే అనేది వాయిస్-ప్రొసీజర్ రేడియో కమ్యూనికేషన్‌లలో ఓ డిస్ట్రెస్ సిగ్నల్.

అందువల్ల ఈనాటి అమెరికన్ సమాజానికి తమ సమాజాభివృద్ధికి రాళ్లెత్తిన కూలీలెవరో, వారి త్యాగమేంటో, వారెందుకు రక్తాన్ని చిందించారో తెలియదంటే అతిశయోక్తి కాదు. అమెరికన్ సమాజానికి లేబర్ డే అంటే సెలవు దినం, మధ్యతరగతి మందహాసం. సమ్మర్ సేల్స్, డిస్కౌంట్స్ సేల్స్, ఔట్ డో ఈవెంట్స్, బార్బిక్యూస్, పిక్నిక్కులు లేదంటే ఓ సాంస్కృతిక సమ్మేళనం.

స్టార్ బక్స్, అమెజాన్ కార్మికుల సమ్మెకు దిక్కుండా ఉండి ఉంటే అమెరికన్ కార్పొరేట్ల దుర్మార్గం ఎలా ఉండేదో ఊహించడమూ కష్టమే. అందుకే ఈ ఏడాది అమెరికన్ ట్రేడ్ యూనియన్లు- ఈ లేబర్ డేని ఉద్యోగావకాశాలు, సవాళ్లు, సమస్యల పేరుతో జరుపుకోబోతున్నాయి.

**పూలమ్మిన చోటే కట్టెలెందుకు అమ్మాల్సివస్తోంది?**

1880ల నాటి కాలం.. బలవంతులు దుర్బల జాతిని బానిసలుగా చూస్తున్నప్పుడు అమెరికా కార్మికవర్గం తిరుగుబాటు చేసింది. గౌరవ ప్రదమైన జీవనాన్ని, జీతాన్ని డిమాండ్ చేసింది. పిల్లలతో వెట్టి చాకిరి వద్దని నినదించింది. సంఘం పెట్టుకునే హక్కు కావాలని పిడికిళ్లు బిగించింది. నెత్తురోడ్చింది. 8 గంటల పని దినాన్ని సాధించింది. అమెరికా పునర్జీవానికి ఊపిరిపోసింది. సెంట్రల్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో తొలి లేబర్ డే న్యూయార్క్ నగరంలో 1882 సెప్టెంబర్ 5 న జరిగింది. 1884లో అమెరికన్ కాంగ్రెస్ సెప్టెంబర్ నెలలో వచ్చే తొలి సోమవారాన్ని లేబర్ డేగా ప్రకటించింది. ఆ తర్వాత పదేళ్లకు అంటే 1894 నుంచి ఫెడరల్ గవర్నమెంటు సెలవు ఇస్తోంది. ఈ మధ్యలో 1886 మే ఒకటిన చికాగో నగరంలో కార్మికుల తిరుగుబాటు ఇందుకు ప్రాణం పోసింది. సుమారు 80 దేశాలు మే డేను మేనెల 1న జరుపుకుంటుంటే కెనడా, అమెరికా మాత్రం సెప్టెంబర్ నెలలో వచ్చే మొదటి సోమవారాన్ని లేబర్ డేగా పాటిస్తున్నాయి.

**1920లో ఏం జరిగింది?**

అమెరికాలో ట్రేడ్ యూనియన్లకు ఘనమైన చరిత్ర ఉన్నా వాటిని ఆర్గనైజ్ చేయడం చాలా కష్టం. ప్రధాన కారణం చలనశీలత(మొబిలిటీ), సమయం(టైమ్). ఒక చోటి నుంచి మరో చోటికి పోవడానికి చాలా సమయం పడుతుంది. ప్రజా రవాణా తక్కువ. అటువంటి పరిస్థితుల్లో 1920లలో పొసాడా వంటి క్రిస్టమస్ సెలబ్రేషన్లు కార్మికులందరూ ఓ చోట చేరి తమ సమస్యల్ని చర్చించుకోవడానికి అవకాశాలు కల్పించాయి. 1920, 21లలో జరిగిన గార్మెంట్స్ (బట్టలు కుట్టడం) మహిళా కార్మికుల సమ్మె ఆ విధంగా జరిగిందేనంటారు.

అమెరికాలో ఆర్థిక సంస్కరణలు పెరిగిన తర్వాత పెట్టుబడిదారీ విధానం బలపడిన తర్వాత కార్మిక సంఘాలు మరింత బలహీన పడ్డాయి. గ్లోబలైజేషన్ తో కార్మిక సంఘాల ఊసే లేకుండా పోయింది. ఇప్పుడున్న కార్మిక సంఘాలలో మొత్తం సభ్యత్వం 54 మిలియన్లకు మించి లేదు. ఇందులో మూడొంతుల మంది ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ఉద్యోగులే. ఏదైనా సమస్య వచ్చినపుడు చర్చలు సంప్రదింపులు తప్ప సమ్మె జరిగిన ఘటన గత 50 ఏళ్లలో లేదంటారు. ఓ కొత్త తరహా కార్మికవర్గం పుట్టుకురావడమే ఇందుకు కారణం. కాంట్రాక్ట్ విధానం తెరపైకి రావడం,హోటల్ వర్కర్లు, బిల్డింగ్ వర్కర్లు, హోమ్ కేర్ వర్కర్లు, జెఫ్ బెజోస్, ఎలాన్ మస్క్ లాంటి ఉద్దండ కార్పొరేట్ పిండాలు కార్మిక సంఘాల వ్యతిరేక ప్రచారం మొదలు పెట్టడం, ఆటోమేషన్ పెరగడం, చేతివృత్తులు సన్నగిల్లడం, కుటీర పరిశ్రమలకు దూరమవడం, సాఫ్ట్ వేర్ రంగం విస్తృతి కావడంతో ప్రతి ఒక్కరూ తన కెరియరే ప్రధానంగా ముందుకు సాగుతున్నారు. సంఘాలు, సమ్మెలనే ఊసే లేకుండా పోయింది. దీనికితోడు కార్మిక సంఘాలు పెట్టుకోవాలంటే ప్రభుత్వమే సవాలక్ష ఆంక్షలు పెట్టడం (ఉదాహరణకు బ్లూమ్ బెర్గ్ యాక్ట్), 30 శాతానికి పైగా కార్మికులు ఆమోదం తెలపాలనడం,1981లో రోనాల్డ్ రీగన్ తీసుకువచ్చిన కొత్త నిబంధన (సమ్మె చేసే కార్మికుల తొలగింపు), యూనియన్లకు వ్యతిరేకంగా పని చేసే కన్సెల్టింగ్ ఏజెన్సీలు పెరగడం వంటివి కూడా కార్మిక ఉద్యమాలను దెబ్బతీశాయి.

మళ్లీ ఊపిరిపోసుకుంటున్న ఉద్యమాలు...

అమెరికాలోని స్టార్ బక్స్ అనే అతిపెద్ద కాఫీ సంస్థ, అమెజాన్ అనే మరో కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులు సమ్మెకు దిగడంతో కార్మిక ఉద్యమం ప్రస్తుత యుగధర్మంలో తిరిగి ప్రాణం పోసుకుంటుందేమో అనిపిస్తోంది. 55 శాతం మంది అమెరికన్లు కార్మిక సంఘాల పట్ల సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. సంఘాలు పెట్టుకోవాలంటే ఏమి చేయాలనే దానిపై ఆరా తీస్తున్నారు. 1980, 1995 మధ్య పుట్టిన వాళ్ళు (మిలీనియల్స్), 1996, 2010 మధ్య పుట్టిన ప్రస్తుత జనరేషన్ (జనరేషన్– జెడ్) చాలా మార్పుల్ని చవిచూశారు. కోవిడ్–19 తర్వాత ఈ తరం పునరాలోచనలో పడింది. ఇతరుల కష్టనష్టాల పట్ల జాలి, కనికరం చూపుతున్న తరాలివి. వీళ్లు ఇప్పుడు గతాన్ని తొవ్వుతున్నారు. జట్టు కట్టాల్సిందే అంటున్నారు. గత 24 నెలల్లో టీమ్‌స్టర్స్, యూపీఎస్, యునైటెడ్ ఆటోవర్కర్స్ యూనియన్లు సాధించిన చారిత్రాత్మక విజయాలే ఇందుకు సాక్ష్యాలు. యూనియన్ల ఫలితంగా అమెరికన్ల జీతాలు పెరిగాయి.

**ట్రేడ్ యూనియన్ల వ్యతిరేక ఖర్చు 340 మిలియన్ డాలర్లు**


కార్మిక సంఘాల గురించి ప్రస్తుత తరం అడుగుతున్న ప్రధాన ప్రశ్నలు ఎలా ఉన్నాయంటే.. –ప్రపంచ వ్యాప్తంగా కార్మిక సంఘాలు తిరోగమనంలోనే ఉన్నాయా? 1970ల తర్వాత కార్మిక సంఘాలు బలహీనపడడానికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? కార్మిక సంఘాలను ప్రభుత్వమే దెబ్బతీసిందా? ప్రజలకు ఇప్పుడు కార్మిక సంఘాలు ఎందుకు కావాలని కోరకుంటున్నారు? వీటిపై అమెరికా కొత్త తరం పరిశోధన, పరిశీలన చేస్తోంది. ట్రేడ్ యూనియన్లను విచ్ఛిన్నం చేసేందుకు కార్పొరేట్ సంస్థలు వేల కోట్ల రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తున్నాయో అర్థం చేసుకుంటున్నారు. దేశంలోని 2వేల కార్పొరేట్ సంస్థలు కార్మిక సంఘాల వ్యతిరేక ప్రచారం కోసం 340 మిలియన్ డాలర్లను ఖర్చు పెడుతున్నాయి. కార్మిక సంఘాల వ్యతిరేక ప్రచార కన్సెల్టీలు విపరీతంగా పుట్టుకొస్తున్నాయి. వీటిని అమెజాన్, స్టార్ బక్స్, టార్గెట్ వంటి బడాబడా కార్పొరేట్ సంస్థలు నియమించుకుంటున్నాయి. కార్మికులకు పెంచే జీతాల కన్నా సంఘాలకు వ్యతిరేకంగా పెట్టే ఖర్చే ఎక్కువగా ఉందని యూనియనిస్టు, డెమోక్రాట్, మేధావి బెర్నీ శాండర్స్ అంటున్నారు.

యూనియన్లు ఉండడం వల్ల వైట్స్ (శ్వేతజాతి), బ్లాక్స్ (నల్ల జాతి) మధ్య అంతరాన్నీ, దూరాన్ని తగ్గిస్తాయని భావిస్తున్నారు. యూనియన్లలో ప్రాతినిధ్యం ఉండే మహిళలకు నాయకత్వ లక్షణాలు పెరగడంతో పాటు యూనియన్లలో లేని మహిళల కంటే సగటున 9.5శాతం అధిక వేతనాలను పొందుతారని భావిస్తున్నారు.

అమెరికా చరిత్రలో ఆర్థిక పోరాటాలే ప్రధానంగా సాగాయి. నల్లజాతి బానిసల రక్తమాంసాలతోనే దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలు బలపడ్డాయి. బానిసత్వం నుంచి విముక్తి లభించినా తమ మాజీ యజమానుల కోసం వళ్లు వంచి పని చేసేలా జాత్యహంకార చట్టాలను తీసుకువచ్చాయి ఆనాటి ప్రభుత్వాలు. మాటల్లో చెప్పలేనంత మానసిక, శారీరక హింసను ఆ బానిస తరం అనుభవించింది. అప్పుడు పుట్టినవే కార్మిక సంఘాలు, పౌరహక్కుల సంఘాలు.

అటువంటి చోట.. ఏ దేశంలోనైతే 8 గంటల పని దినం కోసం రక్తం చిందించారో ఆ దేశంలోనే ఈవేళ కార్మిక వర్గం అనే పదాన్ని వాడడానికే జంకుతున్నారు. ప్రధాన పత్రికల్లో, టీవీల్లో ఆ మాట వినిపించదు. ప్రపంచంలోని ఎక్కడెక్కడి విషయాల్నో తొవ్వితీసి చర్చా గోష్టులు పెట్టే న్యూస్ కాస్టర్లు ఆ పదాన్ని వాడడానికి సిగ్గుపడం విచారకరం.

---



## కోస్తా సమయం ఎడిటర్ పడాల మృతి

రాజమహేంద్రవరం కోస్తా సమయం దినపత్రిక ఎడిటర్ పడాల వీరభద్రరావు సెప్టెంబరు 17వ తేదీ మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంకు గురైన పడాల చికిత్స నిమిత్తం వారం రోజుల క్రితం రాజమహేంద్రవరం నుండి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ వారం రోజుల నుండి ఆసుపత్రిలోని మెడికల్ విభాగంలో చికిత్స పొందుతూ 17వ తేదీ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. పడాల అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం అధ్యక్షులు. అల్లూరి విగ్రహాల ను ప్రతిష్టించేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. పడాల మృతి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.నవీన్‌రాజ్, ఎం.లక్ష్మణ్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టు మునికుమార్ మృతి

గత కొన్నేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న విలేఖరిముని కుమార్ తిరుపతిలో 11వ తేదీ మృతి చెందారు. తాను అనారోగ్యం పాలైనప్పటికీ నెఫ్రోప్లస్ డిపార్ట్‌మెంట్‌పై పెద్ద ఎత్తున పోరాటం సాగించారు. అనారోగ్యం పాలుకాకముందు మునికుమార్ ఈనాడు దినపత్రికలో విలేకరిగా పనిచేశారు. ఆయన స్విమ్స్ పరువు తీసాడని టిటిడి కోర్టు కూడా వెళ్ళింది. మునికుమార్ కోర్టు కేసులను కూడా ఎదుర్కొన్నారు. ముని అనారోగ్యం పాలైనప్పటికీ ఎంతో ధైర్యంగా ఉండేవారు. కిడ్నీ రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చివరి వరకు పోరాడారు. మునికుమార్ వైద్య సహాయం పొందేందుకు ఫెడరేషన్ జిల్లా శాఖ నాయకులు తమ వంతు



సహకారం అందించారు. మునికుమార్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తిరుపతి జిల్లా కమిటీ కన్వీనర్ మల్లెల వాణి, తులసీరామ్, దినకర్ వెంకటేశ్వరరావు, శేఖర్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మునికుమార్ భార్యను, కుటుంబాన్ని ఆదుకునేందుకు తగిన సహాయం అందించాలని నిర్ణయించారు. జిల్లా శాఖలోని సభ్యులందరి తోడ్పాటు కోరారు.

## అనారోగ్యంతో విలేకరి మృతి



గద్వాల సూర్య దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్న సుఖేందర్ వర్మ(36) అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబరు 8వ తేదీ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. సుఖేందర్ మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) తెలంగాణ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు.




పీపులణ్స డెమొక్రసీ సంపాదకులు, సిపిఎం ప్రధానకార్యదరి&శ సీతారం ఏచూరికి చిత్తూరులో సెప్టెంబరు 12వ తేదీ ఫెడరేషన్ నాయకులు నివాళుర్పిస్తున్న దృశ్యం



పరవాడలో సెప్టెంబరు 8వ తేదీ జరిగిన న్యూ ప్రెస్‌క్లబ్ సంబరాల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉపకారవేతనాలు అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు




ఎమ్మిగనూరులో సెప్టెంబరు 11వ తేదీ ఫెడరేషనణ ఆధ్వర్యంలో వరదబాధితుల సహాయార&ధం విరాళాలు సేకరించిన దృశ్యం



# సీనియర్ జర్నలిస్టు మహేష్ లంగ అరెస్టు

గుజరాత్ రాష్ట్రంలోని అహమ్మదాబాద్‌లో అక్టోబరు 8వ తేదీ ది హిందూ దినపత్రికలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టు మహేష్ లంగను పోలీసులు అరెస్టు చేశారు. జిఎస్‌టికి సంబంధించిన ఆరోపణలతో ఈ అరెస్టు చేసినట్టు అధికారులు తెలియజేశారు. మేజిస్ట్రేట్ మహేష్‌కు పది రోజుల రిమాండ్ విధించారు. మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ ఉత్తర్వులపై మహేష్ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి హేతుబద్ధమైన కారణాలను పరిశీలించకుండానే మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధించిందని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ సందర్భంగా తన వాదనలు వినిపిస్తూ సీనియర్ లాయర్ ఉన్‌వాలా సుప్రీంకోర్టు కేసు తీవ్రతను బట్టి రిమాండ్ విధించాలని పలు సందర్భాల్లో ప్రస్తావించినప్పటికీ మేజిస్ట్రేట్ కోర్టు ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని స్పష్టం చేశారు. కేసు విచారణ చేస్తున్న జడ్జి సందీప్ భట్ మహేష్ అభ్యర్థన ప్రతులను ప్రభుత్వ న్యాయవాదులకు అందజేయాలని, ప్రభుత్వ వైఖరి తెలుసుకునేందుకు ఇది తోడ్పడుతుందని స్పష్టం చేశారు. ఈ కేసును అక్టోబరు 14కు వాయిదా వేశారు.

అహ్మదాబాద్‌లో హిందూ దినపత్రికలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టు మహేష్‌ను జిఎస్‌టి కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేసమయంలో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఆహమ్మదాబాద్, జునాగన్, ఖేడా, భావ్‌నగర్‌తో పాటు 14 చోట్ల దాడులు జరిగాయి. మహేష్ ఇంటి నుంచి ఇరవై లక్షల నగదు, కొంత బంగారంతో పాటు భూములకు సంబంధించిన పలు పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలియజేశారు. మహేష్ భార్య, తండ్రి పేరు మీద అనేక అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని, బినామీ కంపెనీల వ్యవహారం ఇందులో ఇమిడి ఉందని కేంద్ర జిఎస్‌టి అధికారుల సమాచారం.

మహేష్ తరపున కేసు వాదిస్తున్న న్యాయవాది వేదాంత్ గురు కేసు వివరాలు తెలియజేశారు. ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించిన డిఎ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలో మహేష్ డైరెక్టర్‌గా కానీ ప్రమోటర్‌గా కానీ లేరని, ఆయన సంతకాలు, ప్రస్తావన ఎక్కడా లేదని స్పష్టం చేశారు. ఆ కంపెనీ లావాదేవీలకు సంబంధించి మహేష్ ప్రమేయం ఎంతమాత్రం లేదన్నారు. డిఎ కంపెనీ మహేష్ బంధువు మనోజ్‌కు చెందినదని, మహేష్ భార్య అందులో స్వల్పమొత్తం వాటాదారుగా ఉన్నారని చెప్పారు. ఈ కంపెనీని మహేష్ వారి పేరుతో పెట్టి బినామీగా నిర్వహిస్తున్నట్టు పోలీసులు తమ రిమాండ్ నివేదికలో పేర్కొన్నారు.

మహేష్ అరెస్టు గుజరాత్‌లోని జర్నలిస్టుల్లో పెద్ద అలజడిని సృష్టించింది. అనేకమంది జర్నలిస్టులు మహేష్ చిత్తశుద్ధి పట్ల తన నమ్మకాన్ని ప్రకటించారు. పలువురు జర్నలిస్టులు ఇటీవల కాలంలో ఆయన రాసిన వార్తాకథనాల వల్లనే ఇటువంటి పరిస్థితి ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. గుజరాత్ వజ్రాల పరిశ్రమ గురించి సంచలనాత్మక కథనాలను ఇటీవలకాలంలో ఆయన రాసారు. ఆ కథనాల ప్రభావం ఈ అరెస్టుకు కారణమై ఉండవచ్చనే అభిప్రాయాలు పలువురు వ్యక్తం చేశారు.